ప్రభాతనవ
SINGIDI తెలుగు దినపత్రిక
# సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
శుక్రవారం 26 జూన్ 2026 సంపుటి: 1 సంచిక: 9 పేజీలు 12 వెల: 6.50
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar Adilabad

72.28 డాలర్లకు పడిపోయిన

## బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర

### పశ్చిమాసియాలో నెలకొంటున్న శాంతి

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడంతో చమురు రవాణాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలు వేగవంతం అవుతున్నాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో గత కొన్ని రోజులుగా చమురు ధరలు భారీగా దిగొస్తున్నాయి. తాజాగా బ్రెంట్ క్రూడ్ ధర అమెరికా–ఇరాన్ యుద్ధం ముందు స్థితికి పడిపోవడం ఊరటనిస్తోంది. -న్యూయార్క్ (సింగిడి)




2



ఫిరాయింపు ఎమ్మెల్యేల

## కేసు విచారణ

స్పీకర్ తీర్పు కాపీలను సమర్పించాలని హైకోర్టు ఆదేశం

2

# తుంగభద్రానదికి 33 కొత్త గేట్లు

కర్ణాటకలోని హోస్పేటలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కేంద్రమంత్రి సీఆర్ పాటిల్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని నూతన గేట్లను ప్రారంభించారు. 2024 ఆగస్టులో వచ్చిన వరద ప్రవాహానికి 19వ గేటు కొట్టుకుపోయింది. దీంతో ఆ ప్రాజెక్టును పరిశీలించిన నిపుణుల కమిటీ సూచనతో రూ.51 కోట్లతో 33 కొత్త గేట్లను అమర్చారు. ఈ కార్యక్రమంలో మూడు రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

-బళ్లారి,జూన్25 (సింగిడి)



## జల వివాదాలను పరిష్కరించుకుందాం

### పంచాయితీలు కాదు...పరిష్కారాలు ముఖ్యం

- తుంగభద్ర గేట్ల ప్రారంభం చరిత్రలో నిలవాలి
- మూడు రాష్ట్రాల పరిధిలో సమస్యలకు పరిష్కారం చూపాలి
- కేంద్రమంత్రి పాటిల్ దీనిని అవకాశంగా తీసుకోవాలి
- తుంగభద్రలో 15 టిఎంసిలకు 5 టిఎంసిలే అందుతున్నాయి
- మునీరాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

బళ్లారి,జూన్25 (సింగిడి):

తుంగభద్ర నది ఒడ్డున.. బళ్లారి వేదికగా జరిగిన ఈ సమావేశం అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదానికి శాశ్వత పరిష్కారం చూపిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. తుంగభద్ర ప్రాజెక్టుకు ఏర్పాటు చేసిన 33 నూతన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు.'తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ ముహూర్తం చరిత్రలో నిలిచిపోతుంది. 3 తరాల సమస్యలను 33 గేట్ల పునరుద్ధరణ పరిష్కరించబోతోంది. 2

తుంగభద్ర డ్యాం కొత్త స్పీల్ వే గేట్లను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులు గురువారం మధ్యాహ్నం ప్రారంభించారు. రూ.51కోట్లతో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన 33 కొత్త స్పీల్ వే గేట్లను ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, శివకుమార్ కలసి ప్రారంభిండం విశేషం. ఈ కార్యక్రమానికి కేంద్ర జలశక్తి శాఖా మంత్రి సీఆర్ పాటిల్‌తో పాటు ఆయా రాష్ట్రాల మంత్రులు, అధికారులు, పార్టీల కార్యకర్తలు హాజరయ్యారు. గేట్ల ప్రారంభోత్సవం అనంతరం విజయనగర జిల్లా హోసపేటలో జరిగే భారీ బహిరంగ సభకు కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రులు వెళ్లారు. అంతకుముందు మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కొప్పల్ జిల్లా మునీరాబాద్‌లోని ఆడిటోరియంలో భేటీ అయ్యారు. అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. తొలుత చంద్రబాబు, డీకే శివకుమార్ భేటీ అవ్వగా.. సమావేశానికి రేవంత్ రెడ్డి 15 నిమిషాలు ఆలస్యంగా వెళ్లారు. అనంతరం ముగ్గురు సీఎంలు, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ నీటి సమస్యలపై కీలక చర్చలు జరిపారు. ఆ తర్వాత అక్కడి నుంచి గేట్ల ప్రారంభోత్సవానికి వెళ్లారు.

## రూ.51 కోట్లతో గేట్ల ఏర్పాటు

మూడు రాష్ట్రాల సీఎంలు కలసి ప్రారంభం
కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి పాటిల్
ఒకేవేదికపై డికె, చంద్రబాబు, రేవంత్



## ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు

### వాటిని పరిరక్షిస్తేనే భవిష్యత్



గంగా, గోదావరి, కావేరి నదుల అనుసంధానం జరగాలి

నెల్లో 33 గేట్ల పునరుద్ధరించాం: సీఎం చంద్రబాబు 2

## పాస్‌పోర్ట్ ఫీజుల భారీ పెంపు

జూలై 1 నుంచి కొత్త ధరలు

- సాధారణ పాస్‌పోర్ట్‌పై రూ.1000 నుంచి రూ.1500 వరకు పెంపు
- తత్కాల్, మైనర్ల పాస్‌పోర్ట్ రుసుముల్లో కూడా గణనీయమైన మార్పులు




2



సమస్యల పరిష్కార వేదికే

## 'ప్రజా దర్బార్'

### మహిళా సంఘాలకు రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు

2

అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు: మంత్రి సీతక్క

గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) తెలిపారు.

- జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (సింగిడి)

## ఉద్యోగులకు భారీ భరోసా

### ఉచిత బీమా, పీఆర్సీపైనా సీఎం హామీ

- రాష్ట్ర ఉద్యోగులు, పెన్షనర్లకు ఉచిత ప్రమాద బీమా
- 14 బ్యాంకులతో తెలంగాణ ప్రభుత్వం ఎంఓయూలు
- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వర్తింపు
- ప్రమాద బీమా కవరేజీ రూ.1 కోటి నుంచి రూ.1.5 కోట్లు
- విమాన ప్రమాద బీమా రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లు
- పీఆర్సీ హామీని తప్పకుండా అమలు చేస్తామని సీఎం స్పష్టం

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులకు కూడా ఉచిత ప్రమాద బీమా సదుపాయం కల్పించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.

- హైదరాబాద్, జూన్ 25 (సింగిడి) 2



## సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట

ఒకేసారి ఐదు కేసుల కొట్టివేత... 2019 నాటి కేసుల నుంచి రేవంత్ రెడ్డికి విముక్తి

ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసుల్లో క్లీన్ చిట్.. 2019 హుజూర్‌నగర్ ఉప ఎన్నికల సమయంలో నమోదైన కేసులు 2

పాఠ్యపుస్తకాల్లో

## 'ఎమర్జెన్సీ' పాఠం

### తొమ్మిదో తరగతి పాఠ్యపుస్తకంలో చేర్చిన ఎన్‌సీఈఆర్టీ

2

ఈ విద్యా ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఎన్‌సీఈఆర్‌టీ నిర్ణయం






## కుప్పకూలిన గోడౌన్

8కి చేరిన మృతుల సంఖ్య

కోల్‌కతాలో ఘటన

కొనసాగుతున్న సహాయక చర్యలు.. సీఎం పర్యవేక్షణ

2



## ట్రిపుల్ తలాక్ ఉండాల్సిందే

బహుభార్యత్వం కూడా సమర్థనీయమే

మహారాష్ట్ర అసెంబ్లీలో ఎన్‌సిపి ఎమ్మెల్యే సనా మాలిక్ వ్యాఖ్యలు

తిప్పికొట్టిన బిజెపి 2

## ఎస్టీ రిజర్వేషన్లు ఇందిరమ్మ పుణ్యం

### అభివృద్ధిని ఓర్వలేకపోతున్న బావాబామ్మర్దులు

ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్రను ప్రారంభించిన టీపీసీసీ చీఫ్



ఇందిరాగాంధీ.. ఎస్టీ రిజర్వేషన్ ఇవ్వకపోయి ఉంటే నేడు లంబాడీలు, ఎరుకల, యానాదిలు ఈ స్థాయిలో ఉండేవాళ్లు కాదని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. లంబాడీల బాగు కోసం పనిచేసే ప్రభుత్వం తమది అని స్పష్టం చేశారు. ఇందిరాగాంధీ గుడిసెలు లేని గ్రామాలు కావాలని అనుకున్నారని.. ఆ దిశగానే తాము ముందుకు వెళ్తున్నామని చెప్పారు.

- హైదరాబాద్, జూన్ 25 (సింగిడి): 2

## వెనెజువెలాలో భారీ భూకంపం

### కుప్పకూలిన వేలాది భవనాలు... 188 మంది దుర్మరణం

- రెండు శక్తివంతమైన భూకంపాల ధాటికి అతలాకుతలం
- వేయి మందికి పైగా గాయాలు
- శిథిలాల కింద పెద్దసంఖ్యలో జనం!
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం



దక్షిణ అమెరికా ఖండంలోని వెనెజువెలా దేశం బుధవారం రెండు శక్తివంతమైన భూకంపాలకు చివురుటాకులా గజగజా వణికిపోయింది. 39 సెకన్ల వ్యవధిలో వచ్చిన భూకంపాల ధాటికి దేశంలో వేలాదిగా కట్టడాలు పేకమేడల్లా కుప్పకూలాయి. చాలా ప్రాంతాలు శిథిలాలతో నిండిపోయి మరుభూమిగా మారాయి.

కరాకస్ (సింగిడి)

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం



# సమస్యల పరిష్కార వేదికే 'ప్రజా దర్బార్'

ములుగు జిల్లా మంగపేట మండలం రాజుపేటలో గురువారం నిర్వహించిన ప్రత్యేక ప్రజా దర్బార్‌లో జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. అక్కినేపల్లి మల్లారం, బ్రాహ్మణపల్లి, రాజుపేట, కత్తిగూడెం, నిమ్మగూడెం, దోమెడ, రామచంద్రునిపేట, వాడేగూడెం, రమణక్కపేట, చుంచుపల్లి, వాగుడుగూడెం గ్రామాల ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇప్పటివరకు మహిళా సంఘాలకు రూ.61 వేల కోట్లకు పైగా వడ్డీలేని రుణాలు అందించామని తెలిపారు. గతంలో రూ.5 లక్షలుగా ఉన్న రుణ పరిమితిని ప్రస్తుతం రూ.10 లక్షలకు పెంచినట్లు చెప్పారు. పాడి కేంద్రాలు, కొనుగోలు కేంద్రాల నిర్వహణలో మహిళా సంఘాలకు అధిక అవకాశాలు కల్పిస్తున్నామని, గ్రామీణ మహిళలు సంఘటితంగా



ముందుకు వస్తే కుటుంబాల ఆర్థికాభివృద్ధి మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ప్రాధాన్య క్రమంలో గృహాలు మంజూరు చేస్తున్నామని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

అనంతరం మంగపేట మండల కేంద్రంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవనానికి మంత్రి సీతక్క, కలెక్టర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. రాజుపేట జడ్పీహెచ్ఎస్‌లో నూతనంగా నిర్మించిన సైన్స్ ల్యాబ్ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్, అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జీ, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




## 72.28 డాలర్లకు పడిపోయిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర

గురువారం ఉదయం బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.28 డాలర్లకు పడిపోయింది. క్రితం సెషన్‌తో పోలిస్తే దీని ధర 4శాతం మేర తగ్గడం గమనార్హం. ఇక, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడాయిల్ ధర 1.69శాతం తగ్గి బ్యారెల్‌కు 69.15 డాలర్లు పలికింది. ఇటీవలి కాలంలో దీని ధర 70 డాలర్ల దిగువకు చేరడం ఇదే తొలిసారి. గడిచిన 24 గంటల్లో హర్మూజ్ జలసంధి మీదుగా కనీసం 2 కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా అయినట్లు అమెరికా ఇంధన మంత్రిత్వశాఖ వెల్లడించింది. రాబోయే కొన్ని వారాల్లోనే ఈ జలమార్గంలో చమురు రవాణా యుద్ధం మునుపటి స్థాయికి పెరుగుతుందని అంచనా వేసింది. పశ్చిమాసియాలో యుద్ధం ముగియడంతో పాటు ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను సడలించడం వంటి కారణాలతో క్రూడాయిల్ ధరలు దిగొస్తున్నాయి.

అటు బంగారం, వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 3996 డాలర్లకు చేరింది. వెండి (ధర 57.35 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. దీంతో హైదరాబాద్ విపణిలో గురువారం ఉదయం 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధర రూ.1.44లక్షలు పలికింది. కిలో వెండి ధర రూ.2.22లక్షలకు దిగొచ్చింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో గోల్డ్ ఫ్యూచర్స్ ధర 1.41లక్షలు (10 గ్రాములకు), వెండి ఫ్యూచర్ ధర రూ.2.13లక్షలుగా (కిలోకు) ట్రేడ్ అవుతోంది. మరోవైపు, దేశీయ స్టాక మార్కెట్ సూచీలు కూడా గురువారం లాభాల్లో కొనసాగాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలకు తోడు.. దేశీయంగా బ్యాంకింగ్, స్థిరాస్తి రంగ సూచీల్లో కొనుగోళ్లు సూచీలకు మద్దతుగా నిలిచాయి. దీంతో ఉదయం 10 గంటల సమయంలో సెన్సెక్స 511.62 పాయింట్లు పెరిగి 77,502 వద్ద, నిఫ్టీ 150 పాయింట్ల లాభంతో 24,172 వద్ద ట్రేడ్ అవుతున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 22 పైసలు పెరిగి 94.33 వద్ద కొనసాగుతోంది.

## సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. 2019 హుజూర్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రచార సమయంలో ఆయనపై నమోదైన ఐదు కేసులను తెలంగాణ ఉన్నత న్యాయస్థానం బుధవారం కొట్టివేసింది. ఈ కేసుల నుంచి తనను విముక్తుడిని చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి దాఖలు చేసిన ఐదు వేర్వేరు పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు తుది తీర్పును వెలువరించింది.

2019లో జరిగిన హుజూర్‌నగర్ ఉప ఎన్నికల సమయంలో ఈ కేసులు నమోదయ్యాయి. అప్పటి మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి తరఫున చురుకుగా ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో, రిటర్నింగ్ అధికారి నుంచి ముందస్తు అనుమతి లేకుండా సమావేశాలు నిర్వహించడం వంటి ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణలతో ఆయనపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

ఈ కేసులను కొట్టివేయాలని రేవంత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం, జూన్ 18న తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా బుధవారం తీర్పును ప్రకటిస్తూ, ఐదు కేసులను కొట్టివేస్తున్నట్లు స్పష్టం చేసింది. హైకోర్టు తాజా తీర్పుతో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసులకు చట్టపరంగా ముగింపు పలికినట్లయింది.



## ఉద్యోగులకు భారీ భరోసా.. ఉచిత బీమా, పీఆర్సీపైనా సీఎం హామీ

ఈ మేరకు 14 బ్యాంకులతో ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో సీఎం స్వయంగా ఒప్పందాలపై సంతకాలు చేసి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం, ప్రభుత్వం కోసం కష్టపడే ఉద్యోగుల భద్రతను కాపాడటం తమ బాధ్యత అని చెప్పారు. ఉద్యోగులు అడగక ముందే ప్రభుత్వం ముందడుగు వేసి ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. పదవీ విరమణ తర్వాత కూడా బీమా ప్రయోజనాలు కొనసాగించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ప్రమాద బీమా కింద ఉద్యోగులకు రూ.1 కోటి నుంచి రూ.1.5 కోట్ల వరకు కవరేజీ లభిస్తుందని తెలిపారు. విమాన ప్రమాదాల సందర్భంలో బ్యాంకులు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు బీమా రక్షణ అందిస్తాయని వివరించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఉద్యోగులందరికీ సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని రేవంత్ స్పష్టం చేశారు. పీఆర్సీ విషయంలో ఇచ్చిన హామీని కూడా తప్పకుండా అమలు చేస్తామని చెప్పారు. ఉద్యోగుల నమ్మకమే ప్రభుత్వానికి బలమని, ప్రభుత్వాలు మారినా ఉద్యోగ వ్యవస్థ శాశ్వతమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జీతాలు చెల్లించలేని పరిస్థితి ఉండేదని విమర్శించిన సీఎం విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నెలా తొలి రోజే జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆదాయం పెరిగేలా ఉద్యోగులు ప్రతిరోజూ అదనంగా గంట పనిచేయాలని కోరారు. వచ్చే అదనపు ఆదాయాన్ని ఉద్యోగుల సంక్షేమానికే వినియోగిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రాజకీయ అంశాలపైనా స్పందించిన సీఎం తాను "గుంపు మేస్త్రీ"నని, రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేసే తన బృందానికి నాయకత్వం వహిస్తున్నానని అన్నారు. మూసీ నది ప్రక్షాళన, మెట్రో విస్తరణ వంటి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపక్షాలు అడ్డంకులు సృష్టిస్తున్నాయని ఆరోపించారు.

## ఎస్టీ రిజర్వేషన్లు ఇందిరమ్మ పుణ్యం

తెలంగాణ కాంగ్రెస్ గిరిజన నేతలు చేపట్టిన ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్రను టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్, హరీశ్‌రావు శకం గతమని.. అధికారం పోయిందన్న అక్కసుతో వారిద్దరూ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి.. బావాబామ్మర్దులకు నచ్చడం లేదని మహేష్ విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు తగ్గకుండా మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. 1 లక్ష 78 వేల కోట్ల రూపాయల విదేశీ పెట్టుబడులు తీసుకొచ్చామని తెలిపారు. ఫ్యూచర్ సిటీని మొదలు పెట్టి 5 లక్షల 78 వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని చెప్పారు. బస్సు యాత్ర ముగింపు కార్యక్రమానికి ప్రియాంక గాంధీని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తామని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ లంబాడ ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యారు.

# వెనెజువెలాలో భారీ భూకంపం



భవనాలు కూలడంతో, శిథిలాలు మీద పడటంతో 188 మంది సజీవ సమాధి అయ్యారు. 1,000 మందికిపైగా గాయాలపాలయ్యారు.

చాలా మంది జాడ గల్లంతైంది. శిథిలాల కింద పెద్దసంఖ్యలో జనం చిక్కుకున్నారన్న వార్తల నడుమ మృతుల సంఖ్య భారీగా పెరగొచ్చని సహాయక బృందాలు వెల్లడించాయి. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం రాజధాని కరాకస్ నగరానికి పశ్చిమంగా 170 కిలోమీటర్ల దూరంలో రిక్టర్ స్కేల్‌పై 7.2 తీవ్రతతో మొదటి భూకంపం సంభవించింది. 39 సెకన్ల తర్వాత అంతకంటే అధిక తీవ్రత(7.5)తో మరో భూకంపం వచ్చింది. రెండు భూకంపాల దెబ్బకు భవనాలు కుప్పకూలాయి. ఇంత తీవ్రతతో వెంట వెంటనే భారీభూకంపాలు రావడం వెనెజువెలాలో గత వందేళ్లలో ఇదే తొలిసారి. భూప్రకంపనలతో ఇళ్లు, దుకాణాలు, కర్మాగారాలు దారుణంగా దెబ్బతిన్నాయి.

దేశంలోని ప్రధాన సైమన్ బొలివర్ అంతర్జాతీయ విమానాశ్రయం సైతం దెబ్బతింది. దీంతో విమాన రాకపోకలను నిలిపేశారు.

కూలిన భవనాల నుంచి క్షతగాత్రులను రక్షించేందుకు సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. యుద్ధప్రాతిపదికన సహాయక, అన్వేషణ చర్యలు చేపడుతున్నామని దేశ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిజ్ తెలిపారు. ఉత్తర కరాకస్‌లోని లా గుయిరా నగరం అన్నింటికన్నా ఎక్కువగా నాశనమైంది. నగరంలో ఎటుచూసిన ప్రకృతి ప్రకోప విలయం కన్పిస్తోంది. కుప్పకూలిన భవనాలతో నగరం మరుభూమిని తలపిస్తోంది.

రక్తమోడుతున్న స్థానికులను అతి కష్టంమీద శిథిలాల నుంచి బయటకు తీసుకొచ్చి అక్కడే నేలమీదనే పడుకోబెట్టి చికిత్సచేస్తున్న దృశ్యాలు, భూకంపం వేళ జనం భవనాల నుంచి ప్రాణభయంతో బయటకు పరుగులు తీస్తున్న దృశ్యాలు మీడియాలో ప్రసారమయ్యాయి. దక్షిణ అమెరికా, కరీబియా భూఫలకాల కూడలిలో ఉండే వెనెజువెలాలో భూకంపాలు సర్వసాధారణం. కానీ ఇలాంటి భారీభూకంపాలు తక్కువే.

తొలి భూకంప కేంద్రాన్ని కరీబియన్ తీరంలోని పశ్చిమ మోరాన్‌లో భూమికి 22 కిలోమీటర్ల లోపల గుర్తించామని అమెరికా జియోలాజికల్ సర్వే తెలిపింది. తర్వాత వచ్చిన భూకంపం కేంద్రాన్ని ఈశాన్య మోరాన్‌లో భూమికి 10 కిలోమీటర్ల లోతులో గుర్తించారు. భూకంప కేంద్రం తక్కువ లోతులో ఉంటే భూకంప వినాశనం దారుణంగా ఉంటుంది. "మేమున్న భవనం కదలడం చూసి భయంతో వణికిపోయాం. కూలి మీదపడుతుందని అనుకున్నా.

చలిలో అమ్మ, కూతురుతో ఆరుబయటే ఉండిపోయాం. కంటిమీద కనుకులేదు. భయంతో ఏడుస్తూ ఉండిపోయాం. బతుకుతామని అనుకోలేదు"అని 41 ఏళ్ల స్థానికురాలు మేరియా క్రిస్టినా డియాజ్ తెలిపారు. పైపులు పేలి మరింత ప్రమాదం సంభవిస్తుందని ముందు జాగ్రత్తగా ఇళ్లకు సహజ వాయు పైప్‌లైన్ సరఫరాను అధికారులు నిలిపేశారు. విద్యుత్ సరఫరా ఆగపోవడంతో కరాకస్ నగరంలో అంధకారం అలుముకుంది. మొబైల్ సేవలు నిలిచిపోయాయి. విద్యాశాఖ స్కూళ్లకు సెలవులు ప్రకటించింది. సబ్‌వే సర్వీసులను రద్దుచేశారు.

దేశంలో అంతర్గత సమస్యల కారణంగా విధించిన సోషల్‌మీడియాపై ఆంక్షలను ఆపత్కాలంలో ఎత్తేసి భూకంపబాధితులకు, బంధువులకు సాయపడాలని ప్రభుత్వాన్ని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమిషన్ కోరింది. 2025 ఆగస్టులో నాటి అధ్యక్షుడు నికొలస్ మదురో 'ఎక్స్'వంటి సామాజికమాధ్యమాలపై నిషేధం విధించారు. ప్రకృతి విపత్తు నేపథ్యంలో ఈ ఘటనను జాతీయ విపత్తుగా అధ్యక్షురాలు ప్రకటించారు. భూకంప ప్రభావిత ప్రాంతాల పునర్‌నిర్మాణం కోసం 20 కోట్ల డాలర్ల నిధిని ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. వీటికితోడు ప్రపంచదేశాల నుంచి విరాళాలు వెల్లువెత్తాయి.

**సాయం చేస్తాం: ప్రధాని మోదీ**

ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మిత్రదేశానికి తగు సాయం అందజేస్తామని 'ఎక్స్' వేదికగా ప్రకటించారు.

## ట్రిపుల్ తలాక్ ఉండాల్సిందే

**ముంబై,జూన్25 (సింగిడి)**

మహారాష్ట్ర రాజకీయాల్లో యూనిఫామ్ సివిల్ కోడ్, ట్రిపుల్ తలాక అంశాలపై కొత్త వివాదం చెలరేగింది. ఎన్‌సీపీ అజిత్ పవార్ వర్గం ఎమ్మెల్యే సనా మాలిక అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అలాగే ఆమె వ్యాఖ్యలపై తీవ్ర నిరసనలు కూడా వస్తున్నాయి. మహారాష్ట్ర అసెంబ్లీలో ఎమ్మెల్యే సానా మాలిక చేసిన ప్రకటన కలకలం రేపింది. భారత్ లో ఖురాన్ ఆధారిత చట్టాలను అమలు చేయాలని, ట్రిపుల్ తలాకనుసమర్థించాలని మాలిక డిమాండ్ చేశారు. పాకిస్తాన్, ఖురాన్, ముస్లిం వ్యక్తిగత చట్టాలను ఉటంకిస్తూ, భారతదేశంలో ఇస్లామిక చట్టాన్ని అమలు చేయాలని ఎన్‌సీపీ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. పాకిస్తాన్ లాగే, భారత్ కూడా ఇస్లామిక చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని ఆమె తెలిపారు. ట్రిపుల్ తలాకనుసమర్థిస్తూ సనా మాలిక.. విడాకులలో వివిధ రూపాలు ఉన్నాయి. తలాక–ఎ–హసన్, తలాక–ఎ–అహ్సన్, తలాక–ఎ–బిద్దత్ అనే మూడు రకాల విడాకులు ఉన్నాయి. ట్రిపుల్ తలాకకుసంబంధించి ఆమోదించిన చట్టం, అప్పటికే ఆచరణలో విస్తృతంగా అమలులో లేని ఒక వ్యవస్థపై ఆధారపడి ఉంది. దాని ప్రస్తావన ఎక్కడా లేదు. ఆ తర్వాత బహుభార్యత్వం గురించి మాట్లాడుతూ, బహుభార్యత్వం కేవలం ఒక మతంలోనే కాకుండా, ప్రతి మతంలోనూ ప్రబలంగా ఉంది. ముస్లింలలో బహుభార్యత్వం గురించి బోధిస్తారు. దానిని పాటించాలి. దీని కోసం ఒక చట్టాన్ని రూపొందించాలని అన్నారు. తన వ్యాఖ్యలకు సంబంధించి సనా మాలిక సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో ఒక వీడియోను పంచుకున్నారు. ట్రిపుల్ తలాక చట్టం అమలుపై అసెంబ్లీలో తన అభిప్రాయాన్ని వెల్లడించానని, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా అన్ని మతాలకు సమానంగా వర్తించే చట్టాలు ఉండాలని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే, ఈ అంశంపై జరిగిన చర్చలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి యోగేష్ కదమ్ స్పందించారని, చట్టాలు అమల్లోకి వచ్చిన తర్వాత అవి అన్ని మతాలకు వర్తిస్తాయని ఆయన చెప్పినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఈ వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు సనా మాలిక పై విమర్శలు గుప్పించారు. మహారాష్ట్ర ప్రభుత్వ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే నితేష్ రాణెళి మాట్లాడుతూ, ట్రిపుల్ తలాక విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక నిర్ణయం తీసుకున్నప్పటికీ, అసెంబ్లీలోని కొందరు ఖురాన్, ముస్లిం గ్రంథాలను ఉటంకిస్తూ యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ)ని ఇప్పటికీ వ్యతిరేకిస్తున్నారని అన్నారు. యూసీసీ గురించి రాజ్యాంగంలో ప్రస్తావించారు, కానీ కొందరు తమ చట్టవిరుద్ధ చర్యలను సమర్థించుకోవలసి వచ్చినపుడు మాత్రమే దానిని ప్రస్తావిస్తారు. ఎవరైనా దేశ చట్టాలను, రాజ్యాంగాన్ని పాటించకూడదనుకుంటే, వారు తమ పదవికి రాజీనామా చేసి పాకిస్తాన్‌కు వెళ్ళిపోవాలి అని సూచించారు.

## ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై విచారణ

### స్పీకర్ తీర్పు కాపీలను సమర్పించాలని హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్,జూన్25 (సింగిడి)**

పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది ఎమ్మెల్యేల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. గతంలో ఈ ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పలువురు ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు పరిశీలించింది. విచారణ సందర్భంగా అనర్హత పిటిషన్లపై స్పీకర్ ఇచ్చిన తీర్పు కాపీలను కోర్టుకు సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. అలాగే పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలతో పాటు స్పీకర్ కూడా తమ కౌంటర్ దాఖలు చేయాలని మరోసారి నోటీసులు జారీ చేసింది. ఇంతకు ముందు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకపోవడంపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో కేసు విచారణను వాయిదా వేస్తూ తదుపరి విచారణను జూలై 22కు నిర్ణయించింది.

## జల వివాదాలను పరిష్కరించుకుందాం

బళ్లారి, కర్నూలు, అనంతపురం, పాలమూరు సమస్యలు తీరుస్తుంది. తక్కువ మాట్లాడటం. అత్యంత వేగంగా పనిచేయడం సీఆర్ పాటిల్ ప్రత్యేకత. అలాంటి వ్యక్తి.. కేంద్ర జల్‌శక్తిశాఖ మంత్రిగా ఉండటంతో ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని సంపూర్ణంగా విశ్వసిస్తున్నానని అన్నారు. నీటి సమస్యలు పరిష్కరించకపోవడంతో నీరంతా సముద్రంలో కలుస్తున్నాయి. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో పాలమూరుకు కేటాయించిన 15 టీఎంసీలలో కేవలం 5 టీఎంసీలు మాత్రమే వాడుకోగలుగుతున్నాం. దాదాపు 10 టీఎంసీల నీరు మా వరకూ రావట్లేదు. రాజోలిబండ సమస్యను సీఆర్ పాటిల్, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పనులు చరిత్రలో నిలుస్తాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాలమూరు వలసల గురించి తనకు అవగాహన ఉందని తెలిపారు. మూడు రాష్ట్రాల కరువు జిల్లాలకు ఇది పరిష్కారం చూపబోతోందని పేర్కొన్నారు. గురువారం తుంగభద్ర డ్యాం కొత్త స్పిల్ వే గేట్లు ప్రారంభించాక, కర్ణాటక కొప్పల్ జిల్లా మునీరాబాద్ బహిరంగ సభలో సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, డీకే శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. కర్నూలు, అనంతపురం రైతుల సమస్యలు తనకు తెలుసు అని చెప కొచ్చారు. మనందరి కష్టాలు, సమస్యలు తెలిసిన నాయకుడు చంద్రబాబు అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి సమస్య పరిష్కారానికి అడుగులు పడుతున్నాయని తెలిపారు. నీటి సమస్యలు పరిష్కరించుకోకపోవడంతో నీరు సముద్రం పాలవుతోందని చెప్పారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి చర్చలు ఓ కొలిక్కి వచ్చాయని అన్నారు. తుంగభద్ర నుంచి 10 టీఎంసీల నీరు తమకు రావడం లేదని చెప్పారు. ద రైతులకు న్యాయం జరగాలని తాము ఆశిస్తున్నామని అన్నారు. చరిత్రలో ఈరోజు సువర్ణ అక్షరాలతో నిలిచిపోతుందని తెలిపారు. తమకు పంచాయితీలు వద్దని.. పరిష్కారం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాయలసీమ, తెలంగాణలోని లక్షలాదిమంది రైతుల సమస్యకు తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పరిష్కారమని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నీటి సమస్యను పరిష్కరించక పోవడంతోనే పాలమూరు వాసులు వలసలు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. నీటి సమస్యలు ఓ కొలిక్కి వచ్చాయని.. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో చర్చించామని తెలిపారు. తుంగభద్రలో పూడికతీతకు సంబంధించిన వ్యవహారంపై కేంద్రమంత్రితో చర్చించామని అన్నారు. తుంగభద్ర నది ఒడ్డున జరిగిన చర్చలు అంతరాష్ట్ర జల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతాయని తెలిపారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక నీటి సమస్యను సీఆర్ పాటిల్ దృష్టికి తీసుకెళ్లామని చెప కొచ్చారు. ఆయన ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తారనే నమ్మకం తమకు ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు

దేశంలో నదుల అనుసంధానం తన కలల ప్రాజెక్టు అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. గంగా, గోదావరి, కావేరి నదుల అనుసంధానం జరగాలని పేర్కొన్నారు.రాయలసీమలోని పలు ప్రాంతాలకు సాగునీరు.. మరికొన్ని ప్రాంతాలకు తాగునీరు అందిస్తున్న ప్రాజెక్టు తుంగభద్ర అని వ్యాఖ్యానించారు. తుంగభద్ర డ్యామ్ 70 ఏళ్ల చరిత్ర ఉన్న ప్రాజెక్టు అని తెలిపారు. తుంగభద్ర తల్లికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా.. అందరూ రైతులకూ నమస్కారాలు అంటూ సీఎం చంద్రబాబు కన్నడలో ప్రసంగించారు. ప్రాజెక్టు నిర్వహణ బాగుంటేనే భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతోందని చెప్పారు. 6 నెలల్లో తుంగభద్ర ప్రాజెక్టు 33 గేట్ల పునరుద్ధరించామని వివరించారు. తమిళనాడుకు నీళ్లు ఇవ్వాలని 1983లో నిర్ణయం తీసుకున్నామని చెప కొచ్చారు. నీటి సమస్యల పరిష్కారానికి కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఇవాళ ముగ్గురు సీఎంలు కలవడం చరిత్రాత్మకమని చెప కొచ్చారు. ఎల్‌నినో వల్ల కొన్ని ప్రాంతాల్లో కరవు సమస్య ఉందని తెలిపారు. నీరు ఉంటేనే చరిత్ర, నాగరికత అని.. ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలని చంద్రబాబు అభివర్ణించారు. వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరముందని అన్నారు. ప్రాజెక్టులు బాగుంటేనే భవిష్యత్తు తరాలకు భరోసా ఉంటుందని చెప్పారు. తుంగభద్ర.. మూడు రాష్ట్రాల్లో లక్షలాది మందికి జీవనోపాధి కల్పిస్తోంది. ఆరు నెలల్లో 33 గేట్లు అమర్చిన అందరినీ అభినందిస్తున్నా. కేంద్ర జల వనరులశాఖ మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ముగ్గురు సీఎంలు కలవడం ఓ చరిత్ర. కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలకు తుంగభద్ర తాగు, సాగు నీరు ఇచ్చింది.

## కుప్పకూలిన గోడౌన్

**కోల్‌కతా,జూన్25 (సింగిడి)**

మహానగరంలోని తరతల ప్రాంతంలో గోడౌన్ కుప్పకూలిన సంఘటనలో మరణించిన వారి సంఖ్య 8కి పెరిగింది. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించామని అధికారులు వివరించారు. మరో18 మంది గోడౌన్ శిథిలాల కింద చిక్కుకున్నారని తెలిపారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో గోడౌన్‌లో 60 మంది వరకు కార్మికులు ఉన్నారని వివరించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, భారత ఆర్మీ, నగర పోలీసులతోపాటు స్థానికుల సహకారంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకోగానే.. మంత్రులతో కలిసి సీఎం సువేందు అధికారి ఘటన స్థలానికి చేరుకున్నారు. స్వయంగా సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరో వైపు బాధితుల కుటుంబ సభ్యుల కోసం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ కంట్రోల్ రూం.. 8697981070, 033 22143526, 033 22535185 నెంబర్లు విడుదల చేసింది. బుధవారం సాయంత్రం ఈ గోడౌన్ కూలిన సంగతి తెలిసిందే. ఈ ఘటన జరిగిన వెంటనే ఐదుగురు కార్మికులు మరణించగా.. 20 మంది తీవ్రంగా గాయపడిన విషయం విదితమే.

## పాఠ్యపుస్తకాల్లో 'ఎమర్జెన్సీ' పాఠం

**న్యూఢిల్లీ, జూన్ 25 (సింగిడి)**

భారత రాజకీయ చరిత్రలో అత్యంత వివాదాస్పదంగా భావించే 'జాతీయ అత్యవసర పరిస్థితి' (ఎమర్జెన్సీ) విధించి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి కీలక నిర్ణయం తీసుకుంది. తొమ్మిదో తరగతి సామాజిక శాస్త్రం పాఠ్య పుస్తకంలో ఎమర్జెన్సీకి సంబంధించిన పాఠాన్ని ప్రవేశపెట్టింది. ఈ అత్యవసర పరిస్థితిని భారత 'ప్రజాస్వామ్యానికి ఎదురైన అతిపెద్ద అంతర్గత సవాళ్లలో ఒకటి'గా ఈ పాఠ్యాంశంలో చెప్పుకొచ్చింది. ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించిన కొత్త సామాజిక శాస్త్ర పుస్తకం 'అండర్‌స్టాండింగ్ సొసైటీ: ఇండియా అండ్ బియాండ్'లోని ఓ అధ్యాయంలో భారత ప్రజాస్వామ్య బలాలు, సవాళ్లను విశ్లేషిస్తూ ఈ ఎమర్జెన్సీ విభాగాన్ని చేర్చినట్లు ఎన్‌సీఈఆర్‌టీ అధికారి ఒకరు అధికారికంగా ధృవీకరించారు. 1975 నుంచి 1977 వరకు దేశంలో కొనసాగిన అత్యవసర పరిస్థితి విధించడానికి దారితీసిన పరిస్థితులను ఈ పుస్తకంలో ఎన్‌సీఈఆర్‌టీ వివరించింది. ఆ సమయంలో దేశాన్ని పీడించిన తీవ్ర నిరుద్యోగ సమస్య, అదుపు లేకుండా పెరిగిన ద్రవ్యోల్బణం, ప్రభుత్వ దుష్పరిపాలన వంటి అంశాలు ప్రజల్లో, ముఖ్యంగా యువతలో తీవ్ర ఆగ్రహానికి కారణమయ్యాయని పుస్తకంలో పేర్కొంది. ఈ పరిణామాల వల్ల దేశంలోని వివిధ ప్రాంతాల్లో భారీ ఎత్తున ప్రజా నిరసనలు, ఉద్యమాలు వెలువెత్తాయని వెల్లడించింది. ఎమర్జెన్సీ కాలంలో దేశంలో నెలకొన్న తీవ్రమైన పరిస్థితులను, రాజ్యాంగ ఉల్లంఘనలను ఈ పాఠ్యాంశంలో పొందుపర్చింది. ఎమర్జెన్సీ 21 నెలల కాలంలో భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన అత్యధిక ప్రాథమిక హక్కులను పూర్తిగా రద్దు చేసినట్లు, ప్రజాస్వామ్యానికి జీవనాడి లాంటి పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలు విధించినట్లు స్పష్టం చేసింది.

# అక్రమపట్టాలు రద్దు.. భూములు స్వాధీనం.



**పెద్దపల్లి, జూన్ 24(సింగిడి న్యూస్):** ముత్తారం మండలంలోని పోతారం, మైదంబండ గ్రామాల్లో ప్రభుత్వ భూములపై అక్రమంగా సృష్టించబడిన పట్టాలను రద్దు చేసి భూములను తిరిగి ప్రభుత్వ స్వాధీనంలోకి తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. విచారణలో పోతారం సర్వే నెం. 59లో 19 ఎకరాలు 01 గుంటలు, మైదంబండ సర్వే నెం. 113లో 11 ఎకరాలు 02 గుంటలు ప్రభుత్వ భూములేనని తేలినట్లు పేర్కొన్నారు. సంబంధిత వ్యక్తులు భూములను సాగు చేయలేదని, వారి భౌతిక స్వాధీనంలో కూడా లేవని వెల్లడించారు. ఈ వ్యవహారంలో సహకరించిన ముగ్గురు సిబ్బందితో పాటు భూములను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు.

# వ్యసనం వీడాలంటే ఆత్మవిశ్వాసమే ఆయుధం
## పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి




**గోదావరిఖని, జూన్ 25: (సింగిడి)** వ్యసనం వీడాలంటే ఆత్మవిశ్వాసమే ఒకటే ఆయుధమని పెద్దపల్లి డిసిపి బి . రామ్ రెడ్డి అన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలై చికిత్స పొందుతున్న బాధితులను పెద్దపల్లి డీసీపీ పరామర్శించారు. గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలోని డీ–అడిక్షన్ సెంటర్‌ను సందర్శించి బాధితుల ఆరోగ్య పరిస్థితి, చికిత్స పురోగతిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితుల్లో మానసిక ఉల్లాసం, సానుకూల మార్పు కోసం క్యారమ్, చెస్ బోర్డులు తదితర ఆటవస్తువులను పంపిణీ చేశారు. వ్యసనం నుంచి బయటపడేందుకు వైద్య చికిత్సతో పాటు కుటుంబ, సామాజిక మద్దతు కూడా అవసరమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు .

# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం.
## ఖని 2 టౌన్ సీఐ ఎన్. ప్రసాదరావు




**గోదావరిఖని, 25(సింగిడి న్యూస్)** డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గోదావరిఖని 2 టౌన్ ఇన్స్పెక్టర్ ఎన్. ప్రసాదరావు పిలుపునిచ్చారు. గోదావరిఖని 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 8 ఇంక్లైన్ కాలనీలో యాంటీ డ్రగ్స్ వీక్‌లో భాగంగా పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ చౌరస్తాలో స్పందన హైస్కూల్ విద్యార్థులతో కలిసి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత గంజాయి, సిగరెట్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం లేదా రవాణా సమాచారం తెలిసిన వెంటనే 1908 లేదా 8712671111కు సమాచారం ఇవ్వాలని కోరారు.



# యూకేజీ చిన్నారులకు పట్టా ప్రదానం
## ఆకట్టుకున్న వార్షికోత్సవ వేడుకలు



**కోహెడ,(సింగిడి :** కోహెడ మండల కేంద్రంలోని శ్రీ ఆదర్శ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో వార్షి కోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించ బడ్డాయి. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బందెల సుజాత ముఖ్య అతి థిగా హాజరై, ప్రిన్సిపల్ యశోద శైలజ, కరస్పాండెంట్ యశోద అంజయ్య, వార్డు సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్ర మాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకు న్నాయి. ముఖ్యంగా చిన్నారుల నృత్యాలు, ఆటపాటలు సభను ఉత్సాహభరితంగా మార్చాయి. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరు చిన్నారుల ప్రతిభను అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బందెల సుజాత మాట్లాడుతూ, విద్యార్థుల ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకు న్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లోనూ రాణించాలని సూచించారు. పాఠశాల విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఉపాధ్యా యులు కృషి చేయాలని అభినందిం చారు. యూకేజీ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టా (కన్వొకేషన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులతో కలిసి వేదికపైకి వచ్చి అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు స్వీకరించారు. చిన్నారుల ఆనందం, తల్లిదండ్రుల గర్వభావం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# అధిక లోడుతో మరణయాత్ర...!

గోదావరిఖని-మంథని మార్గంలో భయానక పరిస్థితి
బాడీ లెవెల్ మించి ఇనుప పట్టీలు కట్టి బొగ్గు రవాణా
సింగరేణి కార్మికుల ప్రాణాలు బలి
ప్రమాదం జరిగినప్పుడే అధికారుల హడావిడి.. ఆ తర్వాత యథాతథం
రవాణా శాఖ కన్నెత్తి చూడకపోవడంపై తీవ్ర ఆరోపణలు
రాజకీయ పలుకుబడే రక్షణ కవచమా?
భూపాలపల్లిలో ఘటన తర్వాతా పాఠం లేదా?





**గోదావరిఖని, జూన్ 24: (సింగిడి)** గోదావరిఖని నుంచి మంథని వెళ్లే ప్రధాన రహదారిపై బొగ్గు లారీల బీభత్సం రోజురోజుకూ పెరుగుతోంది. బాడీ లెవెల్ మించి బొగ్గు లోడ్ చేసి, పైగా ఇనుప ప టీలుఏర్పాటు చేసి ప్రమాదకరంగా రవాణా చేస్తున్న లారీల కారణంగా రహదారిపై ప్రయాణం భయానకంగా మారింది. ఈ మార్గంలో ప్రయాణించే సింగరేణి కార్మికులు, విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఈ బొగ్గు లారీల వల్ల పలువురు ప్రాణాలు కోల్పోయినా, రవాణా శాఖ అధికారులు, సంబంధిత యంత్రాంగం మాత్రం కనీసం కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

**అధిక లోడుతో నిబంధనలకు విరుద్ధంగా రవాణా**

కోల్ ట్రాన్స్‌పోర్ట్ పేరుతో నడుస్తున్న బొగ్గు లారీలు నిబంధనలను బేఖాతరు చేస్తూ రోడ్లపై దూసుకుపోతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. లారీ బాడీ ఎత్తుకంటే ఎక్కువగా బొగ్గు నింపి, అది కింద పడిపోకుండా పటికలు కట్టి తరలించడం వల్ల ఎప్పుడెప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం ప్రజలను వెంటాడుతోంది. లారీలు దూసుకెళ్లే సమయంలో బొగ్గు ముక్కలు, దుమ్ము రోడ్డుపై పడిపోవడం సాధారణమైందని, ఈ దృశ్యాలు చూస్తుంటే ఇది రవాణా కాదని, బహిరంగ ప్రాణహానికే నిదర్శనమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కార్మికుడి ప్రాణం తీసిన బొగ్గు ముక్క**

ఈ నిర్లక్ష్య రవాణా ఎంత ప్రమాదకరమో గతంలో జరిగిన ఘటనలే చెబుతున్నాయి. టూ ఇంక్లైన్ వద్ద విధులకు వెళ్తున్న ఓ సింగరేణి కార్మికుడిపై లారీ పైనుంచి బొగ్గు ముక్క పడి అతడు మృతి చెందిన ఘటన స్థానికులను ఇప్పటికీ కలచివేస్తోంది. విధులకు వెళ్తున్న కార్మికుడే రోడ్డుపై ఇలా బలి కావాల్సి రావడం బొగ్గు రవాణాలో ఎంతటి నిర్లక్ష్యం నెలకొని ఉందో అద్దం పడుతోంది. అయినా ఈ ఘటన తర్వాత కూడా ఎలాంటి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోలేదని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

**అధిక లోడు బొగ్గు రవాణానుఅరికట్టాలి**



అధిక లోడుతో వెళ్తున్న బొగ్గు లారీల వల్ల రోడ్లపై ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయి. లారీలు బాడీ సామర్థ్యాన్ని మించి బొగ్గు లోడుతో రాకపోకలు సాగించడం వల్ల ప్రజలు, కార్మికులు ప్రాణభయంతో ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధిక లోడుతో వెళ్తున్న బొగ్గు రవాణాను వెంటనే అరికట్టాలి.. రవాణాశాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా కఠిన చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నాం..

**తొడుపునూరి రమేశ్ కుమార్,**
**సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు...**

**స్పీడ్ బ్రేకర్ కనిపించక.. డ్రైవర్ మృతి**

ఇదే మార్గంలో గతశీ లో మరో విషాదం చోటుచేసుకుంది. రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు సరిగా కనిపించకపోవడంతో అదుపుతప్పిన బొగ్గు లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టగా డ్రైవర్ మృతి చెందిన ఘటన ఆందోళన కలిగించింది. రహదారి భద్రత, హెచ్చరిక బోర్డులు, లారీల నియంత్రణ -- ఈ మూడు అంశాల్లోనూ తీవ్ర వైఫల్యం స్పష్టంగా కనిపించినా, ఆ తర్వాత కూడా పరిస్థితిలో మార్పు రాలేదని స్థానికులు చెబుతున్నారు.

**ప్రమాదం జరిగినప్పుడే హడావిడి**

ఎప్పటిలాగే ప్రమాదం జరిగిన వెంటనే అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని హడావిడి చేయడం, చర్యలు తీసుకుంటామని హామీలు ఇవ్వడం తప్ప, కొన్ని రోజులు గడిచిన తర్వాత మళ్లీ పరిస్థితి మామూలే అవుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు. బొగ్గు లారీల అధిక లోడ్, వేగ నియంత్రణ, రహదారి భద్రత, బొగ్గు కప్పివేత, బాడీ ఎత్తు మించి లోడింగ్‌పై నిరంతర పర్యవేక్షణ ఉండాల్సి ఉండగా, ఎక్కడా అలాంటి చర్యలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తమవుతోంది.

**రాజకీయ పలుకుబడే రక్షణ కవచమా?**

ఈ కోల్ రవాణా వెనుక రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తులు ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే నిబంధనలకు విరుద్ధంగా లారీలు నడుస్తున్నా, అధిక లోడ్‌తో రోడ్లపై ప్రాణహాని సృష్టిస్తున్నా, రవాణా శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు బలంగా వ్యక్తమవుతున్నాయి. ప్రజల ప్రాణాల కంటే పలుకుబడి ఉన్న వారి లాభాలకే ప్రాధాన్యం ఇస్తున్నారా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**భూపాలపల్లిలో ఘటన తర్వాతా పాఠం లేదా?**

ఇటీవల భూపాలపల్లిలో డీటీఓ పైకి బొగ్గు లారీ దూసుకెళ్లిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అలాంటి ఘటనలు వరుసగా జరుగుతున్నా, బొగ్గు లారీల నియంత్రణపై సంబంధిత శాఖలు ఇంకా కఠిన చర్యలు చేపట్టకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రాణాలు పోయిన తర్వాతే స్పందించే అధికార యంత్రాంగం, ప్రమాదం జరగక ముందే ఎందుకు మేల్కొనడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# శభాష్.... శరత్ కుమార్..

ఆర్యవైశ్య సంఘం భవన నిర్మాణానికి సహకరించండి..
మున్సిపల్ చైర్మన్ కు వినతి పత్రం ఇచ్చిన "లెంకలపల్లి"
సంఘం అభివృద్ధి దిశగా తొలి అడుగు వేసిన యువ నాయకుడు ం




జమ్మికుంట, జూన్ 25 (సింగిడి): జమ్మికుంట ఆర్యవైశ్య పట్టణ ఎన్నికల్లో పోటీ చేస్తున్న లెంకలపల్లి శరత్ కుమార్ ఒక అడుగు ముందుకు వేసి సంఘం అభివృద్ధి కోసం మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ ను కలిసి ఆర్యవైశ్య సంఘ భవన నిర్మాణం కోసం సహాయ సహకారాలు అందించాలని కోరగా వెంటనే స్పందించిన మున్సిపల్ చైర్మన్ తప్పకుండా మీ సమస్యను పరిష్కరిస్తారని మీ సంఘ భవన నిర్మాణానికి అండగా నిలబడతానని హామీ ఇచ్చారు. గురువారం మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ ను ఆర్యవైశ్య పట్టణ సంఘం అధ్యక్షుడి పదవి కోసం బరిలో ఉన్న శరత్ కుమార్ స్థానిక వైశ్యులతో కలిసి చైర్మన్ ను కలిసి గతంలో మున్సిపల్ పరిధిలోని సైదాబాద్ సమీపంలో ఒక ఎకరం భూమితో పాటు 50 లక్షల రూపాయల నిధులు ప్రభుత్వం అప్పుడు మంజూరు చేసిందని వారికి తెలిపారు. కానీ అప్పుడు భవన నిర్మాణం చేపట్టడంలో మా ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు చొరవ చూపకపోతే ఆ భవన నిర్మాణం కార్యరూపం దాల్చలేదని ప్రస్తుతం అతి పెద్ద వ్యాపార కేంద్రమైన జమ్మికుంట లో ఆర్యవైశ్యులకు ఒక భవనం లేదని మీరు సహకరిస్తే భవన నిర్మాణం మొదలుపెడతామని కోరగా వెంటనే స్పందించిన చైర్మన్ హామీ ఇవ్వడంతో శరత్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు.

**హామీలు కాదు అమలు చేసి చూపిస్తా**
**లెంకలపల్లి శరత్ కుమార్**

ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్ష పదవి కోసం బరిలో ఉన్న శరత్ కుమార్ మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యమని తను రాజకీయాలు చేయడానికి పదవిలోకి రావడం లేదని సంఘం అభివృద్ధి కోసం పాటుపడాలని సంకల్పంతో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్ష బరిలో ఉన్నానని ఈ విషయాన్ని వైశ్యులు గమనించి తనను గెలిపించాలని కోరారు. ఆర్యవైశ్య సంఘ భవన నిర్మాణం ఎందుకు నిర్మించలేదు పట్టణ వైశ్య సోదరీ సోదరీమణులకు తెలుసునని కానీ నేను నా పదవి కాలం ముగిసేలోపు ఆర్యవైశ్య సంఘ భవన నిర్మాణానికి పూర్తిస్థాయిలో కృషిచేసి భవనం నిర్మిస్తానని దానికి మీ అందరి సహాయ సహకారాలు అవసరమని ఆయన తెలిపారు. అభివృద్ధి పనుల్లో అందరితో కలిసి ముందుకు వెళ్తానని ఆపద సమయంలో ఒంటరిగానైనా మీ వద్దకు వస్తానని మీ బిడ్డగా మీ సేవకుడిగా మీకు అందుబాటులో ఉంటానని ఆయన ఆర్యవైశ్యులకు తెలిపారు. ఒక అవకాశం ఇచ్చి పట్టణ అధ్యక్షుడిగా గెలిపించండి మీకు అందుబాటులో ఉండి మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇచ్చిన మాటను నెరవేర్చడమే తన లక్ష్యమని రాజకీయాలకు అతీతంగా సంఘం అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడతానని ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుకుంటారని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో గర్రెపల్లి వెంకన్న యాంసాని సురేష్ రమేష్ యాంసాని సమ్మయ్య ముక్క వేణు చిదురాల కృష్ణమూర్తి చిటికెసి నందయ్య దేవునూరి వినయ్ యాద శ్రీధర్ తోపాటు పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

# జమ్మికుంట ఎమ్మార్వోగా గడ్డం సుధాకర్ బాధ్యతల స్వీకరణ
## ఘన స్వాగతం పలికిన కార్యాలయ సిబ్బంది



**జమ్మికుంట, జూన్ 25 (సింగిడి) :** జమ్మికుంట మండల తాహసిల్దారుగా గడ్డం సుధాకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో జమ్మికుంటలో తాహసిల్దారుగా పనిచేసిన వెంకట్ రెడ్డి బదిలీ కావడంతో దాదాపు నెల రోజులకు పైగా తాహసిల్దార్ గా ఎవరు బాధ్యతలు తీసుకోలేదు. కరీంనగర్ కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా ఉన్న గడ్డం సుధాకర్ నియమిస్తూ వారం రోజుల క్రితం ఉత్తర్వులు వచ్చినప్పటికీ అక్కడ రిలీవ్ కాకపోవడంతో బాధ్యతలు తీసుకోలేదు. గురువారం తాహసిల్దారుగా బాధ్యతలు తీసుకున్నారు. బదిలీపై వచ్చిన తహసీల్దార్ సుధాకర్ కు కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. సర్ కార్యక్రమంలో భాగంగా తాహసిల్దార్ పోలింగ్ స్టేషన్ నెంబర్ 179 పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్లు శంకర్ సత్యనారాయణ తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ఎమ్మార్వో లేక నెల రోజులుగా అవస్థలు**

జమ్మికుంట ఎమ్మార్వో నల్ల వెంకటరెడ్డి బదిలీపై వెళ్లగా నెలరోజులుగా జమ్మికుంటకు తహసిల్దార్ రాకపోవడంతో మండల ప్రజలతో పాటు ఎంతో మంది విద్యార్థులు వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం నానా అవస్థలు పడ్డారు. ఒకవైపు ఎమ్మార్వో మరో వైపు డిప్యూటీ తహసిల్దార్ ఇద్దరు లేకపోవడంతో కార్యాలయంలో చాలా పనులు పెండింగ్లో ఉండగా నెల రోజుల తర్వాత నూతన తాసిల్దార్ గా గడ్డం సుధాకర్ రావడం తో విద్యార్థులు మండల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

# యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

హుజరాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవి
ఘనంగా యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం
మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతిజ్ఞ..



**జమ్మికుంట, జూన్ 25 (నినాదం) :** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ఈగల్ ఫోర్స్, కరీంనగర్ సీపీ ఆదేశాల మేరకు గురువారం హుజూరాబాద్ ఏసిపి మాధవి ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమాన్ని జమ్మికుంటలో నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌక్ నుండి గాంధీ చౌరస్తా వరకు విద్యార్థులతో డ్రగ్స్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్ రూరల్ సీఐ పులి వెంకట్ లతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు యువత విద్యార్థులు దూరంగా ఉండాలని ఒకసారి డ్రగ్స్ కు అలవాటు పడితే మీ జీవితాలు సర్వనాశనం అవుతాయని ఆమె తెలిపారు. ఒత్తిడిని అధిగమించడానికి క్రీడల పై దృష్టి పెట్టాలని సమాజాన్ని పట్టిపీడిస్తున్న అతి పెద్ద మహమ్మారి మాదకద్రవేయుల దుర్వినియోగమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. యువత విద్యార్థులు చెడు వ్యసనాలకు లోను కాకూడదని చదువుల వల్ల కలిగే ఒత్తిడిని అధిగమించేందుకు డ్రగ్స్ వైపు కాకుండా స్పోర్ట్స్ శారీరక వ్యాయామం పై దృష్టి పెట్టాలని సూచించారు. హుజురాబాద్ డివిజన్ ను డ్రగ్స్ రహిత డివిజన్ గా మార్చాలని ఎవరైనా కొనిన చట్టరీత్యా నేరమని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇలాంటి వారు మీకు కనబడితే పోలీసులకు సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆమె పేర్కొన్నారు. గతంలో డ్రగ్స్ పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ముగ్గుల పోటీలు వివిధ సామాజిక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించడం జరిగిందని ఆమె తెలిపారు. అనంతరం డ్రగ్స్ కు దూరంగా ఉంటామని డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటుపడతామని పట్టణ ప్రజలతోపాటు విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట ఎస్ఐలు రవి రాజేష్ సంజీవ్ తో పాటు యువకులు పాతకాల ప్రవీణ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# జాప్యంపై కలెక్టర్ సీరియస్
## రామగుండం పనులు వేగవంతం చేయాలని ఆదేశం

**పెద్దపల్లి, జూన్ 25: (సింగిడి న్యూస్)** రామగుండం అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని ఏమాత్రం సహించబోమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను హెచ్చరించారు. మంజూరైన ప్రతి పనిని వెంటనే క్షేత్రస్థాయిలో ప్రారంభించి గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. డీఎంఎఫ్‌టీలో నిధుల కొరత లేకపోయినా పనులు నత్తనడకన సాగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ జె. అరుణశ్రీతో కలిసి రామగుండం అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్మశానవాటికలు, మహిళా శక్తి భవనాలు, విద్యాసంస్థల అభివృద్ధి, తాగునీటి పనులు, ఇతర మౌలిక వసతుల పనుల్లో పురోగతి లేకపోవడాన్ని ప్రస్తావించారు. ప్రతి ఇంజినీరింగ్ అధికారి రోజువారీగా పర్యవేక్షణ చేసి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.



మీడియా అకాడమీ చైర్మన్
# శ్రీనివాస్ రెడ్డికి ఘన స్వాగతం

కరీంనగర్ పర్యటనలో అధికారులతో సమావేశం
పలువురు నాయకుల మర్యాదపూర్వక భేటీ

**కరీంనగర్,సింగిడి:** తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి కరీంనగర్ జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం రాత్రి ఆర్అండ్‌బి అతిథిగృహానికి చేరుకున్నారు. ఈసందర్భంగా కరీంనగర్ ఆర్డీవో కె మహేశ్వర్ ఆయనకు సాదర స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (ఐజేయూ) నాయకులు కూడా శ్రీనివాస్ రెడ్డిని కలసి శాలువా లతో ఘ నంగా సన్మానిం చారు. ఈసందర్భంగా ఆర్డీవోతో పలు అంశా లపై చైర్మన్ చర్చించారు. ఆయనను కలిసినవారిలో సమాచార పౌర సంబం ధాలశాఖ సహాయ సంచాలకుడు జి లక్ష్మణ్ కుమార్, సహాయ కార్యనిర్వాహక సమాచార ఇంజనీర్ ఉషారాణి, సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ గౌడ్,ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు నగునూరి శేఖర్,జిల్లా అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్,నాయకులు ఒంటెల కృష్ణ, ఎలగందుల రవీందర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పాతికేళ్ల పడుచు పిల్లలా...!

## సమ్మర్‌లో శరీరం, ఆరోగ్యాన్ని చల్లగా ఉంచే సూపర్ ఫుడ్..



మహిళల్లో హార్మోన్ల అసమతుల్యతను సరిచేయడానికి, పురుషులలో శక్తిని పెంచడానికి కూడా దీనిని ఉపయోగిస్తారు. వేసవిలో వచ్చే అలసటను దూరం చేసి శరీరానికి తక్షణ శక్తిని అందించడంలో గోందు కటిరా అద్భుతంగా పనిచేస్తుంది. దీనిని మిల్క్ షేక్స్, లస్సీ లేదా నిమ్మరసంలో కలుపుకుని తీసుకోవడం వల్ల ఆరోగ్యంతో పాటు రుచి కూడా లభిస్తుంది.



**రోగనిరోధక శక్తి:**
శరీరంలోని తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచి, ఇన్ఫెక్షన్ల నుండి మనల్ని కాపాడుతుంది. బాక్టీరియా, వైరస్‌లతో పోరాడే శక్తిని శరీరానికి ఇస్తుంది. కీళ్ల నొప్పులతో బాధపడేవారికి ఇది ఎంతో మేలు చేస్తుంది. పిరియడ్స్ సమయంలో వచ్చే సమస్యలను, హార్మోన్ల అసమతుల్యతను తగ్గించడంలో ఇది సహాయపడుతుంది. ప్రసవం తర్వాత మహిళలకు శక్తిని ఇవ్వడానికి కూడా దీనిని వాడుతారు. ఇందులో ఉండే యాంటీ ఏజింగ్ గుణాలు చర్మంపై ముడతలు, మచ్చలను తగ్గిస్తాయి. వేసవి ఎండల వల్ల వచ్చే చర్మ వ్యాధులను నివారించి చర్మాన్ని కాంతివంతంగా ఉంచుతుంది.

**ఎసిడిటీ నుండి ఉపశమనం:**



దీనికి ఉన్న సహజమైన శీతలీకరణ స్వభావం వల్ల, కడుపులో అధికంగా ఉత్పత్తి అయ్యే యాసిడ్‌ను ఇది నియంత్రిస్తుంది. దీనివల్ల గుండెల్లో మంట ఎసిడిటీ సమస్యలు తగ్గుతాయి. ఇందులో ఉండే ఫైబర్ జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది. మలబద్ధకం, గ్యాస్, అసిడిటీ వంటి సమస్యలతో బాధపడేవారికి ఇది గొప్ప ఉపశమనం కలిగిస్తుంది. కాల్షియం, మెగ్నీషియం పుష్కలంగా ఉండటం వల్ల ఎముకలు బలంగా తయారవుతాయి.

**మలబద్ధక నివారణ:**
ఇందులో ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉండటం వల్ల దీర్ఘకాలిక మలబద్ధకంతో బాధపడేవారికి ఇది ఒక సురక్షితమైన సహజ నివారిణి. వేసవిలో వచ్చే మూత్రపిండాల సమస్యలు, మూత్రంలో మంటను తగ్గించడంలో గోందు కటిరా ప్రభావవంతంగా పనిచేస్తుంది. రాత్రంతా నీటిలో నానబెట్టినప్పుడు ఇది జెల్ లాగా మారుతుంది. ఈ జెల్ పేగుల లోపలి పొరపై ఒక రక్షణ కవచంలా ఏర్పడి, కడుపులో మంటను, అల్సర్ల వల్ల కలిగే నొప్పిని తగ్గిస్తుంది. మలబద్ధకంతో బాధపడేవారికి ఇది మల విసర్జన సాఫీగా జరిగేలా చేస్తుంది.

**పేగుల రక్షణ :**
పేగుల వాపు లేదా ఇరిటబుల్ బవెల్ సింద్రోమ్ వంటి సమస్యలు ఉన్నవారికి గోండ్ కతీరా ఒక ఉపశమనకారిగా పనిచేస్తుంది. ఇది పేగుల గోడలపై ఒక రక్షక పొరలా ఏర్పడి ఇరిటేషన్ తగ్గిస్తుంది. శరీరంలోని మెటబాలిజంను పెంచడమే కాకుండా, ఇది తిన్న తర్వాత కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. దీనివల్ల అతిగా తినడం తగ్గి, బరువు సులభంగా తగ్గుతారు.



**ప్రీబయోటిక్ గుణాలు:**

గోండ్ కటిర అనేది గోధుమ బంక వంటిది. ఆస్ట్రాగాలస్ ప్రొపింకస్ అనే నాచు రకం మొక్కల వేర్ల నుంచి సేకరిస్తారు. జిగట పదార్థంగా కనిపించే దీనికి వాసన, రుచి ఏమీ ఉండదు. దీనిని నీటిలో లేదా పాలల్లో వేస్తే కొద్దిగా కరిగి జెల్లీలాగా మారుతుంది. గోందు కటిరాలో ఉండే పాలీశాకరైడ్లు పేగుల్లో ఉండే మంచి బ్యాక్టీరియాకు ఆహారంగా పనిచేస్తాయి. ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా పెరగడం వల్ల జీర్ణక్రియ సాఫీగా సాగుతుంది. శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. గోందు కటిరాకు అద్భుతమైన శీతలీకరణ గుణాలు ఉన్నాయి. వేసవిలో దీనిని తీసుకోవడం వల్ల శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది. తద్వారా వడదెబ్బ తగిలే ప్రమాదం తగ్గుతుంది.

**ఎలా ఉపయోగించాలి?:**
1-2 టీస్పూన్ల గోండ్ కతీరాను రాత్రంతా నీటిలో నానబెట్టాలి. ఉదయాన్నే అది జెల్ లాగా ఉబ్బి కనిపిస్తుంది. ఈ జెల్‌ను నిమ్మరసం, మజ్జిగ, పాలు లేదా లస్సీలో కలుపుకుని తాగవచ్చు. వేసవిలో వచ్చే డీహైడ్రేషన్, జీర్ణ సమస్యలను ఎదుర్కోవడా నికి గోందు కటిరా ఒక ఉత్తమమైన మార్గం. అయితే, దీనిని తీసుకునేటప్పుడు తగినంత నీరు త్రాగడం చాలా ముఖ్యం, ఎందుకంటే ఇందులోని ఫైబర్ శరీరంలోని నీటిని గ్రహిస్తుంది. కృత్రిమ కూల్ డ్రింక్స్ కంటే గోందు కటిరా వంటి సహజ పానీయాలను తీసుకోవడం వల్ల ఆరోగ్యం మెరుగుపడు తుంది. ఈ సమ్మర్‌లో మీ డైట్‌లో దీనిని చేర్చుకుని చల్లగా, ఆరోగ్యంగా ఉండండి.



# కేవలం 15 రోజులు ఇలా చేస్తే షుగర్ మాయం..!

ఆధునిక వైద్య విజ్ఞానం ప్రకారం, టైప్ 2 షుగర్ వ్యాధికి ప్రధాన కారణం ప్యాంక్రియాస్ లోపం కాదని, కేవలం 10-15% మాత్రమే. మిగిలిన 85-90% షుగర్‌కు కారణం శరీరంలో పేరుకుపోయిన అనవసర పదార్థాలు అని, ఇవి కణాలలో పేరుకుపోయి ఇన్సులిన్ రెసిస్టెన్స్‌కు దారితీస్తాయని తెలిపారు. ఈ ఇన్సులిన్ రెసిస్టెన్స్‌ను ఆహార నియమాల ద్వారా సరిదిద్దవచ్చని తెలుపుతున్నారు. షుగర్ అనేది భయంకరమైన భూతం కాదని, మనకుటుంబాలకే దానిని మన తెలుగు గడ్డ మీద నుంచి తరిమేయగలిగే సామర్థ్యం ఉందని తెలుపుతున్నారు వైద్యులు.

**నీటి చికిత్స:** నీటిని సరైన పద్ధతిలో, సరైన సమయంలో తాగడం షుగర్ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుంది. ఉదయం నిద్రలేవగానే: రెండు గ్లాసుల నీళ్లు , ఒక గంట తర్వాత: మళ్ళీ రెండు గ్లాసుల నీళ్లు, భోజనానికి అరగంట ముందు: రెండు గ్లాసుల నీళ్లు, భోజనం తర్వాత ఒకటిన్నర గంట విరామం తీసుకుని: సాయంత్రం వరకు ప్రతి గంటకు ఒక గ్లాసు నీళ్లు, సాయంత్రం 5:30 గంటలకు: మరొకసారి రెండు గ్లాసుల నీళు ఈ పద్ధతిలో నీళ్లు తాగడం ద్వారా షుగర్ స్థాయిలను సమర్థవంతంగా నియంత్రించవచ్చని ప్రణాళిక సూచిస్తుంది.



**ఉదయం అల్పాహారం:** మొలకలు తీసుకోవడం ఉత్తమం.



మొలకలు తినడానికి అరగంట ముందు: ఒక గ్లాసు పుదీనా, కొత్తిమీర, తులసి ఆకు జ్యూస్‌లో అర చెంచా లేదా ఒక చెంచా తేనె, నిమ్మరసం కలిపి తాగాలి. పుదీనా, కొత్తిమీర ఎక్కువగా, తులసి తక్కువగా ఉండాలి. ఇది ప్రకృతి సిద్ధమైన ఔషధం లాంటిదని పేర్కొనబడింది. మొలకలు సాధ్యం కాకపోతే, నూనెలో వేయించని ఇంటి టిఫిన్లు (ఇడ్లీ వంటివి) చేసుకోవచ్చు.

**మధ్యాహ్న భోజనం:**
50% కూర, 50% అన్నం నిష్పత్తిని పాటించాలి. అంటే, 100 గ్రాముల అన్నం తింటే 100 గ్రాముల కూర తీసుకోవాలి. ఆకుకూరలు లేదా మీకు నచ్చిన కూరగాయలను ఎంపిక చేసుకోవచ్చు. ఉప్పు, కారం, నూనె వినియోగాన్ని ప్రస్తుత వాడకంలో సగానికి తగ్గించాలి. మాంసాహారం, వేపుడు కూరలు, నిల్వ పచ్చళ్లకు దూరంగా ఉండాలి.

**సాయంత్రం పానీయం:**
సాయంత్రం 4:30 గంటలకు: ఒక గ్లాసు మునగాకు, కరివేపాకు జ్యూస్ తాగాలి. రాత్రి భోజనం: రాత్రిపూట కేవలం పండ్లను మాత్రమే తీసుకోవాలి. జామ, బొప్పాయి, పుచ్చకాయ, కీరదోస, కర్బూజా వంటి నీటి శాతం, పీచు పదార్థం ఎక్కువగా ఉండే పండ్లను ఎంపిక చేసుకోవాలి. షుగర్ ఉన్నవారు పండ్లు తినకూడదనే అపోహను తొలగించి, పొట్ట నిండా పండ్లు తినడం వల్ల షుగర్ తగ్గడమే తప్ప పెరిగే అవకాశం లేదని తెలుపుతున్నారు.



# కొవ్వును కరిగించే సొర

## లాభాలు తెలిస్తే వావ్ అనాల్సిందే





నేటి ఆధునిక జీవనశైలిలో అనేక ఆరోగ్య సమస్యలు సాధారణమయ్యాయి. ఊబకాయం, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, అంతర్గత కొవ్వు పేరుకుపోవడం వంటివి వీటిలో కొన్ని. తక్కువ తిన్నా బరువు పెరుగుతున్నామని ఆందోళన చెందుతున్న వారికి, ఉద్యోగ వ్యాపారాలు చేసుకుంటూ ఎక్కువ కార్బోహైడ్రేట్ల ఆహారం తీసుకుంటున్న వారికి.. సొరకాయను అద్భుతమైన పరిష్కారంగా సూచిస్తున్నారు ఆయుర్వేద నిపుణులు.. అధిక కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహారాలను "ఎనిమీ డైట్స్"గా, తక్కువ కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహారాలను "ఫ్రెండ్లీ డైట్స్"గా గుర్తించాలి. ప్రకృతిలో అతి తక్కువ కార్బోహైడ్రేట్లు ఉన్న కూరగాయలలో సొరకాయ అత్యుత్తమమైన దని సొరకాయ అని చెబుతున్నారు.

చాలా మంది సొరకాయను ఒక "పసరు కూరగాయ"గానో లేదా రోగులు మాత్రమే తినే ఆహారంగానో భావిస్తారు. అయితే, సొరకాయ వెనుక దాగి ఉన్న ఆరోగ్య రహస్యాలు తెలిస్తే, ప్రతి ఒక్కరూ దీనిని నిత్యం ఆహారంలో చేర్చుకోవడానికి ఆసక్తి చూపుతారు. 100 గ్రాముల సొరకా య ముక్కలలో 96 శాతం నీటి శాతమే ఉంటుంది. ఈ నీరు మిన రల్స్ తో కూడుకుని ఉండటం విశేషం..

**పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలు:**
తక్కువ క్యాలరీలు, తక్కువ కార్బోహైడ్రేట్లు: 100 గ్రాముల సొరకాయ ముక్కలలో కేవలం 12 క్యాలరీలు మాత్రమే ఉంటాయి. దీనిలోని కార్బోహైడ్రేట్ల శాతం 2.5 గ్రాములు. ప్రోటీన్ 0.3 గ్రాములు, ఫ్యాట్ 0.1 గ్రాములు ఉంటాయి. ఇవి దాదాపు లేనట్లే. ఇది బూడిద గుమ్మడికాయతో సమానంగా అతి తక్కువ కార్బోహైడ్రేట్లు కలిగిన కూరగాయ.

**సొరకాయను ఆహారంలో ఎలా చేర్చుకోవాలి?..**

**సొరకాయను కూరగా వండుకుని, లేదా జ్యూస్ రూపంలో తీసుకోవచ్చు. జ్యూస్ చేసేటప్పుడు లేత సొరకాయ తొక్కను తీయకుండానే వాడవచ్చు. చిన్నపిల్లలకు కూడా చిన్నప్పటి నుంచే సొరకాయ కూరలను అలవాటు చేయడం వల్ల వారికి ఇది ఇష్టమైన ఆహారంగా మారుతుంది. సొరకాయను సాంబార్‌లో వేయడమే కాకుండా, ఎక్కువగా కూర వండుకుని తినడం మంచిది.. ఇలా సొరకాయను నిత్యం ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చు..**

**బరువు తగ్గడానికి సహాయం:**
తక్కువ క్యాలరీలతో పాటు అధిక నీటిశాతం (96 శాతం) ఉండటం వల్ల సొరకాయ ఆకలిని నియం త్రించి, పొట్టను నింపుతుంది. అర కిలో సొరకాయ కూర 60 క్యాలరీలు మాత్రమే అందిస్తుంది. ఇది ఒక చిన్న కాఫీ కప్పుతో పోలిస్తే తక్కువే. కాఫీలో పాలు, పంచదార వల్ల క్యాలరీలు, కార్బోహైడ్రేట్లు ఎక్కువ. సొరకాయ తక్కువ క్యాలరీలతో నిండిన ఆహారం కాబట్టి, ఎంత తిన్నా బరువు పెరగకుండా, శరీరంలోని కొవ్వును కరిగించడానికి దోహదపడుతుంది.

**మధుమేహం నియంత్రణ:**
తక్కువ కార్బోహైడ్రేట్లు, తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కారణంగా సొరకాయ మధుమేహాన్ని నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. రోజుకు అర లేదా ముప్పావు కిలో సొరకాయ కూరను పుల్కాతో కలిపి తినడం ద్వారా పోస్ట్ లంచ్ షుగర్ స్థాయిలు అదుపులోకి వస్తాయని పేర్కొంటున్నారు.



**మూత్రవిసర్జనను పెంచి, యూరినరీ ఇన్ఫెక్షన్లను తగ్గిస్తుంది:**
సొరకాయ డైయూరిటిక్ లక్షణాలను కలిగి ఉంది. ఇది మూత్రవిసర్జనను పెంచుతుంది. దీనివల్ల శరీరంలోని అధిక నీరు బయటకు పోయి, నీరు నిలవకుండా బరువు తగ్గడానికి తోడ్పడుతుంది. అలాగే, మూత్రనాళ ఇన్ఫెక్షన్లు (యూరినరీ ఇన్ఫెక్షన్స్), కిడ్నీలో రాళ్లను తగ్గించడానికి కూడా సొరకాయ ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు నిరూపించారు.

**ఆసిడిటీ నియంత్రణ:**
సొరకాయలో ఉండే మినరల్స్, నీటి శాతం శరీరంలో క్షార స్వభావాన్ని (ఆల్కలనిటీ) పెంచుతాయి. దీనివల్ల అధిక ఆమ్లత్వం (హైపర్ ఎసిడిటీ), పొట్టలో మంట, అల్సర్ ఫార్మేషన్ వంటి సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. కూల్ డ్రింక్స్, ఐస్ క్రీమ్స్, పంచదార ఉత్పత్తులు శరీరంలో ఆమ్లత్వాన్ని పెంచి హాని కలిగించగా, సొరకాయ జ్యూస్ వంటివి క్షార స్వభావాన్ని పెంచి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

**రసాయనాలు లేని కూరగాయ:** సొరకాయ చెట్లకు పురుగు మందులు కొట్టాల్సిన అవసరం లేదు. ఎందు కంటే వాటికి పురుగులు పట్టవు. ఎరువులు కూడా పెద్దగా అవసరం లేకుండానే కాయలు కాస్తాయి. అందువల్ల ఇది సురక్షితమైన, రసాయన రహిత ఆహారం.

## స్టాక్ మార్కెట్ Stock Market

# లక్ష్యం దాటిన పరోక్ష పన్ను వసూళ్లు..

## ఆ ఒక్కటీ మిస్

**దిల్లీ:** దేశంలో పరోక్ష పన్ను వసూళ్లు లక్ష్యాన్ని దాటాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం రూ.15.52 లక్షల కోట్ల మేర పరోక్ష పన్నుల వసూళ్లను లక్ష్యంగా పెట్టుకోగా.. వాస్తవ వసూళ్లు ఆ అంచనాలను మించాయని ప్రభుత్వవర్గాలు గురువారం వెల్లడించాయి. కస్టమ్స్, ఎక్సైజ్, జీఎస్టీ కలిపి సవరించిన అంచనాలు రూ.15.52 లక్షల కోట్లు దాటినట్లు పేర్కొన్నాయి.

వాస్తవంగా ఎంత మొత్తం వచ్చిందనే వివరాలు వెల్లడించకుండా.. ఏ పన్ను రూపంలో ఎంత శాతం పన్ను వసూలైందనే వివరాలను అధికారులు వెల్లడించారు. కస్టమ్స్ డ్యూటీ అంచనాలతో పోలిస్తే 102 శాతం వసూలైందని, ఎక్సైజ్ డ్యూటీ 101 శాతం, సీజీఎస్టీ 100.8% వసూలైందని అధికార వర్గాలు వెల్లడించాయి. మొత్తంగా జీఎస్టీ, ఇతర పన్నులు కలిపి పరోక్ష పన్ను వసూళ్లు 101.2 శాతంగా ఉన్నట్లు తెలిపాయి.

రోడ్‌స్టర్ ధరను రూ.60 వేలు తగ్గించిన ఓలా ఎలక్ట్రిక్ మిగిలిన అన్నీ పన్నులూ లక్ష్యాన్ని చేరుకున్న



ప్పటికీ.. ఒక్క పాన్ మసాలాపై విధించిన హెల్త్, నేషనల్ సెక్యూరిటీ సెస్సు మాత్రం అంచనాలను అందుకోలేకపోయింది. 40 శాతం జీఎస్టీ రేటుకు అదనంగా ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి ఈ ప్రత్యేక సెస్సును కేంద్రం వసూలు చేస్తోంది. ఈ సెస్సు రూపంలో రూ.2,330 కోట్లు వస్తాయని ప్రభుత్వం భావించగా.. కేవలం 63 శాతం మాత్రమే లక్ష్యాన్ని చేరుకుంది. కొత్తగా ప్రవేశపెట్టిన పన్ను కావడం వల్ల ఈ తగ్గుదల ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఈ సెస్సు రూపంలో రూ.14 వేల కోట్లు రాబట్టాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# యుద్ధం వేళ కేంద్రం మరో నిర్ణయం.. పెట్రోకెమికల్స్ దిగుమతులపై ఊరట

పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం దేశ ప్రజలపై పడకుండా ఉండేందుకు కేంద్రం చర్యలు ముమ్మరం చేస్తోంది. ఇప్పటికే పెట్రోల్, డీజిల్‌పై విధిస్తున్న అదనపు ఎక్సైజ్ డ్యూటీని తగ్గించిన సంగతి తెలిసిందే. తాజాగా కొన్ని కీలక పెట్రో కెమికల్ ఉత్పత్తులకు దిగుమతి సుంకాన్ని మినహాయిం చింది. నేటి (ఏప్రిల్ 2) నుంచి జూన్ 30 వరకు ఈ మినహాయింపు అమల్లో ఉండనుంది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది."దేశీయ పరిశ్రమకు కీలకమైన పెట్రో కెమికల్ ముడిసరకుల లభ్యతకు ఆటంకం కలగకుండా చూడటం, దీనిపై ఆధారపడిన రంగాలపై వ్యయ ఒత్తిళ్లను తగ్గించడం, దేశంలో సరఫరా స్థిరత్వాన్ని కాపాడటం కోసం ఈ చర్యలు చేపట్టాం. అయితే, ఈ కస్టమ్స్ డ్యూటీ (జబర్‌శీఎం ఐబ్‌ఎ) మినహాయింపు తాత్కాలికమే. దీనివల్ల తుది ఉత్పత్తులను కొనుగోలు చేసే వినియోగదారుల పైనా అదనపు భారం పడకుండా ఉపశమనం లభిస్తుంది" అని ఆర్థిక మంత్రిత్వశాఖ తమ ప్రకటనలో వెల్లడించింది.

# రోడ్‌స్టర్ ధరను రూ.60 వేలు

## తగ్గించిన ఓలా ఎలక్ట్రిక్

ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ తన ప్రీమియం మోటార్ సైకిల్ రోడ్‌స్టర్ ఎం 9.1ఎక్స్ ధరను భారీగా తగ్గించింది. 4680 భారత్‌సెల్‌పై రూపొందిన ఈ బైక్ ధరను ఏకంగా రూ.60 వేలు తగ్గిస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. ప్రస్తుతం దీని ధర రూ.1,89,999 ఉండగా.. రూ.1,29,999కు తగ్గిస్తున్నట్లు వెల్లడించింది.



ఓలా తన గిగా ఫ్యాక్టరీలో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన బ్యాటరీ సెల్ (4680 భారత్ సెల్‌ను) ఈ మోటార్ సైకిల్‌లో వినియోగించింది. ఈ సెల్ తయారీ వేగవంతం చేసిన నేపథ్యంలో దీని ధరలు తగ్గుముఖం పట్టాయని తెలిపింది. ఈ ప్రయోజనాన్ని వినియోగదారులకు బదిలీ చేయడంలో భాగంగా రోడ్‌స్టర్ మోటార్ సైకిల్ ధరను భారీగా తగ్గిస్తున్నట్లు వెల్లడించింది.

అయితే, ఈ మోటార్ సైకిల్‌ను లిమిటెడ్ టైమ్ విండోలో మాత్రమే కొనుగోలుకు అనుమతిస్తారు. ఏప్రిల్ 3న సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు కొనుగోలు విండోను తెరవనున్నట్లు ఓలా ప్రతినిధి తెలిపారు. రోడ్‌స్టర్ అందుబాటును బట్టి ఎప్పటికప్పుడు పర్చేజ్ విండో సమయాలను వెల్లడిస్తామని పేర్కొంది. ఓలా ఎలక్ట్రిక్ రోడ్‌స్టర్ 9.1 ఒకసారి ఛార్జింగ్ చేస్తే 500 కిలోమీటర్లు వరకు ప్రయాణించొచ్చని కంపెనీ చెబుతోంది.

# ట్రంప్ టారిఫ్ భయాలు..

## ఫార్మా స్టాక్స్ కుదేలు

ఓవైపు ఇరాన్‌పై యుద్ధం చేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మరోవైపు తన టారిఫ్ వార్‌ను మాత్రం కొనసాగిస్తూనే ఉన్నారు. ఫార్మా దిగుమతులపై నూరు శాతం సుంకాలు విధించేందుకు సిద్ధమవుతున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో దేశీయ ఫార్మా కంపెనీ స్టాక్స్ కుదేలయ్యాయి. గతేడాది కూడా ట్రంప్ ఇలాంటి ప్రతిపాదనను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. అప్పట్లోనూ ఫార్మా స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి.

ఇతర దేశాల నుంచి అమెరికాలోకి దిగుమతయ్యే ఫార్మా ఉత్పత్తులపై నూరు శాతం సుంకం విధించేందుకు వైట్ హౌస్ సిద్ధమవుతోందన్న పలు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అమెరికాలో తయారీ కోసం ఏ కంపెనీలైతే ఒప్పందానికి ముందుకురాలేదో వాటిపై సుంకాలు విధించబోతున్నట్లు ఆ కథనాల సారాంశం. అమెరికాలో తయారీకి ముందుకొస్తే సుంకాల నుంచి మినహాయింపు ఉంటుందని ట్రంప్ గతంలోనే ప్రకటించారు. అయితే, సుప్రీంకోర్టు తీర్పు పరిధిలోకి రాకుండా సెక్షన్ 232 కింద సుంకాలు వేయాలని ట్రంప్ యోచిస్తున్నట్లు సమాచారం.



ఈ పరిణామాల నేపథ్యంలో దేశీయ ఫార్మా కంపెనీల స్టాక్స్ గురువారం ట్రేడింగ్ సెషన్‌లో అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. బయోకాన్ 5% శాతం మేర నష్టపోగా.. గ్లెన్‌మార్క్ ఫార్మా, అరబిందో ఫార్మా, సన్‌ఫార్మా, ఎల్‌పీసీఏ ల్యాబ్స్ వంటి స్టాక్స్ 4 శాతం మేర నష్టాల్లో ట్రేడవుతున్నాయి. నిఫ్టీ 50 ఇండెక్స్ ఈ ఉదయం దాదాపు 2 శాతం మేర నష్టపోగా.. నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ 3.8 శాతం మేర క్షీణించింది. దేశీయ ఫార్మా కంపెనీలకు అమెరికా అతిపెద్ద మార్కెట్. ఆ దేశానికి అవసరమైన జనరిక్ డ్రగ్స్‌ను ఎగుమతి చేస్తుంటాయి. దీంతో పెద్దమొత్తంలో ఆదాయం అక్కడి నుంచి సమకూరుతుంది.

సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం
26-6-2026

# ఎడిటోరియల్

Editorial

## ఇరాన్‌తో ఆయిల్ డీల్‌కు మళ్లీ అవకాశం !

ప్రపంచం బాగుండాలంటే ముందు ట్రంప్ దూకుడుకు అక్కడి పార్లమెంట్ కళ్లెం వేయాలి. ఇరాన్‌పై ఇంకా ఆంక్షలు విధించడం, బెదిరించడం వంటివి చేయకుండా చూసుకోవాలి. ఎందుకంటే ఒక్క ట్రంప్ కారణంగా ప్రపంచం యావత్తూ అతలాకుతలం అయ్యింది. సునీమా వచ్చినంత పనయ్యింది. మళ్లీ కోలుకోవడమెలా అన్న సందిగ్ధంలో ప్రపంచ దేశాలు ఉన్నాయి. అన్ని దేశాల ఆర్థిక స్థితి దిగజారింది. ముఖ్యంగా భారత్ లాంటి అనేక దేవాల్లో ఆర్థిక సంక్షోభం నెలకొంది. ఈ క్రమంలో ఇరాన్‌ను తన మానా తను బతికేలా చూడాలి. ట్రంప్ ఇక తన దేశ పురోగతికి సమయం కేటాయిస్తే చాలు. హర్మోజ్ తెరుచుకోవడం, చమురు ధరలు దిగిరావడం అన్నది ఊరటనిచ్చే అంశం. ముఖ్యంగా భారత్‌కు పెద్ద ఊరట అని చెప్పాలి. అలాగే భారత్ ఎవరి వద్ద చమురు కొనాలో వద్దో అన్నది అమెరికాకు సంబంధించిన వ్యవహారం కాదు. భారత్ ఎవరితో వాణిజ్యం చేయాలో చేస్తుంది. ఎవరితో చమురు డీల్ చేసుకోవాలో చేసుకుంటుంది. అంతేగానీ వేలుపెట్టాలని ఇక ట్రంప్ చేడడం మానుకోవాలి. ట్రంప్ తీరువల్ల అమెరికా ఇప్పటికీ పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయింది. అక్కడా చమురు ధరలు పెరిగాయి. నిరుద్యోగం పెరిగింది. అక్కడున్న వారిని వెళ్లగొట్టే ప్రయత్నంలో తీసుకుంటున్న నిర్ణయాలు ప్రణసంకటంగా మారాయి. ముఖ్యంగా భారతీయ టెక్కీలకు ఇదొక సమస్యగా మారింది. ఇకపోతే చమురు ధరలు దిగిరావడం, మళ్లీ హర్మోజ్ తెరుచుకోవడం తో ఇక స్వేచ్ఛా వాణిజ్యానికి అవకాశం వచ్చింది. దీనిపై అటు ట్రంప్ కానీ, ఇటు ఇరాన్ కానీ పేచీలు లేకుండా చూసుకోవాలి. పశ్చిమాసియాలో యుద్ధం ముగియడంతో పాటు ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను సడలించడం వంటి కారణాలతో క్రూడాయిల్ ధరలు దిగొస్తున్నాయి. అటు బంగారం, వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో భారత్–ఇరాన్ మధ్య ఇంధన రంగంలో మళ్లీ కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇరాన్ చమురు మంత్రి మొహ్సెన్ పక్‌నెజాద్ ఈ వారం భారత పెట్రోలియం సహజ వాయు మంత్రిత్వ శాఖ అధికారులతో సమావేశం కానున్న నేపథ్యంలో, భారత్‌కు ఇరాన్ నుంచి ముడి చమురు సరఫరాల భవిష్యత్తుపై ఆసక్తి నెలకొంది. దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత ఈ ఏడాది ప్రారంభంలో పరిమిత స్థాయిలో ఇరాన్ చమురు దిగుమతులు తిరిగి ప్రారంభమయ్యాయి. అమెరికా ఆంక్షలకు ముందు భారత్‌కు ప్రధాన ముడి చమురు సరఫరాదారుల్లో ఇరాన్ ఒకటి. ముఖ్యంగా తక్కువ ధరలు, అనుకూల క్రెడిట్ సౌకర్యాలు, భారత రిఫైనరీలకు అనువైన నాణ్యత కారణంగా ఇరాన్ చమురుకు మంచి డిమాండ్ ఉండేది. భారత్–ఇరాన్ మధ్య జరగనున్న తాజా చర్చలు ఇంధన రంగంలో కొత్త అవకాశాలకు దారితీయవచ్చని నిపుణులు భావిస్తున్నారు. అయితే పూర్తి స్థాయిలో ఇరాన్ చమురు దిగుమతులు పునరుద్ధరించబడేందుకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉందని, భవిష్యత్ కొనుగోళ్లు వాణిజ్య ప్రయోజనాలు, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు మరియు ఆంక్షల పరిస్థితులపై ఆధారపడి ఉంటాయని విశ్లేషకులు చెబుతున్నారు. 2015లో భారత్ సుమారు 11 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడి చమురును ఇరాన్ నుంచి దిగుమతి చేసుకుంది. అది దేశ మొత్తం చమురు దిగుమతుల్లో 6 శాతం వాటాను కలిగి ఉంది. 2016లో ఈ దిగుమతులు 14 ఎంఎంటీలకు చేరి వాటా 6.7 శాతానికి పెరిగింది. అయితే, 2017లో ఇరాన్ నుంచి దిగుమతులు భారీగా పెరిగాయి. ఆ ఏడాది భారత్ 27 ఎంఎంటీల చమురును కొనుగోలు చేయగా, దేశ మొత్తం చమురు అవసరాల్లో ఇరాన్ వాటా 12.6 శాతానికి చేరుకుంది. ఇదే గరిష్ట స్థాయి. 2018లో దిగుమతులు 23 ఎంఎంటీలకు తగ్గినా, ఇరాన్ వాటా 10.4 శాతంగా కొనసాగింది. 2019లో 24 ఎంఎంటీల దిగుమతులతో ఇరాన్ వాటా 10.6 శాతంగా నమోదైంది. అయితే 2019 మేలో అమెరికా ఇరాన్‌పై ఆంక్షలను కఠినతరం చేసి, చమురు కొనుగోలు చేసే దేశాలకు ఇచ్చిన మినహాయింపులను రద్దు చేయడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

దీంతో భారత్ ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్లను నిలిపి వేయాల్సి వచ్చింది. ఈ ప్రభావం 2020లో స్పష్టంగా కనిపించింది. ఆ ఏడాది భారత్ కేవలం 2 ఎంఎంటీల చమురును మాత్రమే ఇరాన్ నుంచి దిగుమతి చేసుకుంది. దీంతో దేశ మొత్తం చమురు దిగుమతుల్లో ఇరాన్ వాటా 1 శాతం కంటే దిగువకు పడిపోయింది. ఇటీవల నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ (ఎన్‌ఐఓసీ) భారత రిఫైనరీలు, వ్యాపార సంస్థలను సంప్రదించి భవిష్యత్ చమురు సరఫరాలపై చర్చలు ప్రారంభించి నట్లు సమాచారం. అయితే భారత ర్గి÷నైరీలు ప్రస్తుతం జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. అమెరికా ఆంక్షలపై స్పష్టత, చెల్లింపు విధానాలు, షిప్పింగ్ మరియు బీమా సౌకర్యాలపై భరోసా లభించిన తర్వాతే పెద్ద ఎత్తున కొనుగోళ్లపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

కెప్లర్ డేటా ప్రకారం, జూన్ నెలలో భారత్ రోజుకు సుమారు 73 వేల బ్యారెళ్ల ఇరాన్ ముడి చమురును దిగుమతి చేసుకుంది. ఏప్రిల్‌లో పరిమిత స్థాయిలో పునఃప్రారంభమైన సరఫరాలు క్రమంగా పెరుగుతున్నట్లు ఇది సూచిస్తోంది.

## త్యాగానికి ప్రతీక మొహర్రం



> మొహర్రం మాసం లోని పదో తేదీ శుక్రవారం హిజ్రీ 60వ సంవత్సరం నాడు హుస్సేన్ హోరా హోరీగా పోరాడు తున్న సమయంలో, సూర్యుడు అస్తమించే సమయం కావడంతో, కొంత వ్యవధి కావాలని అనుమతి గైకొనగా, శత్రువులు అదే అదనుగా భావించి, నమాజ్లో భాగంగా సిజ్దా చేస్తుండగా బాణాలతో దారు ణంగా హతమార్చి, తలను మొండెం నుంచి వేరు చేసి, చేతులు ఖండించి బాణాలకు, బరిసెలకు తగిలించుకుని నాట్య విన్యాసాలు చేశారు.

హిందువులు, ముస్లిం సోదరులూసమిష్టిగా జరుపుకునే మొహర్రం ప్రత్యేకత సంతరించుకుంది. త్యాగానికి, మహోన్నత సనాతన సాంప్రదాయానికి, మత సామ రస్యానికి ప్రతీక మొహర్రం వేడుక. ధర్మసంస్థాపన లక్ష్యంగా, నమ్మిన సిద్ధాంతాల కోసం పలువురు ప్రాణాలర్పించిన మాసం మొహర్రం. ధర్మ సంస్థాపనార్థం హజ్రత్ ఇమామ్ హుస్సేన్, హసన్ లు తమ ప్రాణాలను అర్పించి 14 వందల సంవత్సరాలు గడిచినా అమరవీరుల త్యాగాన్ని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో స్మరిస్తూ, అమరుల త్యాగశీలతకు జోహార్లను అర్పించడం సత్సాంప్రదాయంగా ఆచరిస్తున్నారు. మొహ ర్రం మాసమంటే రక్తపు టేరులతో ఎర్రబారిన కర్బల మైదానం ముస్లిం సోదరుల కళ్లలో సజీవంగా సాక్షాత్కరిస్తుంది. ధర్మాధర్మా లకు జరిగిన సంఘర్షణ ఫలితమే కర్బల దుర్ఘటనగా ముస్లింలు భావిస్తారు. ఇస్లాం మత స్థాపకుడు ప్రవక్త మహమ్మద్ పరమపదిం చినఅనంతరం సమ సమాజ స్థాపన కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో, సౌదీ అరేబియాలో తమ ప్రతినిధిని ఎన్నుకునే కార్యక్రమాన్ని చేప ట్టారు. తదనుగుణంగా మదీనా రాజధానిగా గల రాజ్యానికి హజ్రత్ అబూబకర్ తొలి ఖలీఫాగా ఎన్నుకొనగా, అనంతరం హజ్రత్ ఉమర్, హజ్రత్ ఉస్మాన్ హజ్రత్ అలీలను ఖలీఫాగా ఎన్నుకున్నారు. వీరి పరిపాలన సమయంలో న్యాయం, ధర్మం నాలుగు పాదాలపై నడిచాయని చెపుతారు. ధార్మిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో సమానత్వం వెల్లి విరిసిందంటారు. ఐదవ ఖలీఫాగా ప్రజలు ఇమాం హుస్సేన్ తమ ప్రతినిధిగా ఎన్నుకోగా, సిరియా ప్రాంతానికి గవర్నరుగా ఉన్న హజ్రత్ మివాయా అధికార దాహంతో ఖలీఫా పదవిని ఆశించి పోటీపడగా, ఇరువర్గాల మధ్య యుద్ధానికి నాంది పలికింది. యుద్ధ పరిణా మాలను గ్రహించిన హుస్సేన్, రక్తపాత నివారణకై రణరంగం నుండి నిష్క్రమించి, ప్రజలు తమకు విశ్వాసంతో కట్టబెట్టిన అధికారాన్ని త్యాగం చేశారు. పదవీ కాంక్షా లోలుడైన మివాయ తన కుమారునికి పట్టం కట్టాలని ప్రజలపై ఒత్తిడి తెచ్చిన స్థితిలో, ప్రాణభయంతో ప్రజలు మివాయ కొడుకు యజీద్ రాజుగా గుర్తిస్తారు. అయితే ఈ చర్యలు ప్రజాస్వామ్య వాదులకు మింగుడు పడలేదు. తత్ఫలితంగా ప్రజలు రాజుకు ఎదురు తిరిగి ఉద్యమిస్తారు. ఉద్యమ నాయకత్వ బాధ్యతలను హజ్రత్ హుస్సేన్ కి అప్పగిస్తారు. ఇస్లాం నిబంధనల ప్రకారం ఏసమస్య కైనా చర్చలు సంప్రదింపులే పరిష్కార మార్గాలు కావడం మూలంగా, హజ్రత్ హుస్సేన్ సిరియా రాజధాని కుఫాకు సంప్రదింపులకై బయలు దేరి వస్తుండగా, రాజు యజీద్ విషయాన్ని తెలుసుకుని హుస్సేన్ రాజధానికి వెళ్ళి చర్చలు జరిపితే తన అధికారానికి ముప్పు వాటిల్లక తప్పదని గ్రహించి, హుస్సేన్ ను అడ్డుకోవడానికి పెద్ద సైన్యాన్ని పంపుతాడు. మార్గ మధ్యలో కర్బల మైదానంలో యజీద్ సైన్యం ఎదురై హుస్సేన్ పరివారాన్ని అడ్డగిస్తారు. దీనితో ఇరువర్గాల మధ్య భీకర యుద్ధం జరుగుతుంది. హుస్సేన్ పరివారం శత్రు సైన్యాన్ని చీల్చి చెండాడినా, కొంతకాలం యుద్ధం జరిగాక చివరకు హుస్సేన్ ఒక్కడే మిగులగా, మొహర్రం మాసం లోని పదో తేదీ శుక్రవారం హిజ్రీ 60వ సంవత్సరం నాడు హుస్సేన్ హోరా హోరీగా పోరాడు తున్న సమయంలో, సూర్యుడు అస్తమించే సమయం కావడంతో, కొంత వ్యవధి కావాలని అనుమతి గైకొనగా, శత్రువులు అదే అదనుగా భావించి, నమాజ్లో భాగంగా సిజ్దా చేస్తుండగా బాణాలతో దారుణంగా హతమార్చి, తలను మొండెం నుంచి వేరు చేసి, చేతులు ఖండించి బాణాలకు, బరిసెలకు తగిలించుకుని నాట్య విన్యాసాలు చేశారు. అట్టిరోజును ఇస్లాం మతస్తులు త్యాగదినంగా పరిగణించి త్యాగ శీలతకు ప్రతీకగా పీర్ల దినాన్ని మొహర్రం పేరుతో జరుపు కుంటూ అమర వీరులను స్మరిస్తారు.

మొహర్రంను హిందూ, ముస్లింలు సమైక్యంగా జరుపు కోవడం అనాదిగా సంప్రదాయంగా వస్తోంది. తెలుగు ప్రాంతాల్లో, మరీ ముఖ్యంగా నిజాం పాలిత ప్రాంతాల్లో మొహర్రం పండుగను ముస్లిములే కాక అన్ని వర్గాల ప్రజలూ జరుపుకోవడం వందలాది ఏళ్ళుగా సాగుతోంది. యాత్రా చరిత్ర కారుడు ఏనుగుల వీరాస్వామయ్య జూన్ 29, 1830న నిజాం పాలిత ప్రాంతాల్లో ప్రారంభమైన మొహర్రం పండుగను తాను రచించిన కాశీయాత్ర చరిత్రలో అభివర్ణించారు. మొహర్రం నెల పదవ రోజు యౌమీ ఆషూరా. ముహమ్మద్ ప్రవక్త మనుమడైన హుసేన్ ఇబ్న్ అలీ, కర్బలా యుద్ధంలో అమరుడైన రోజు. ముహర్రం నెలను, “షహీద్ “ (అమర వీరుల ) నెలగా వర్ణిస్తూ, పండుగలా కాకుండా, వర్ధంతిలా జరుపు కుంటారు. షియా ఇస్లాంలో ఈ ముహర్రం నెల, “ఆషూరా”, కర్బలా యుద్ధంలో మరణించిన వారి జ్ఞాపకార్థం, శోక దినాలుగా గడుపుతారు. షియాలు మాతమ్ (శోక ప్రకటన) జరుపుతారు. తెలంగాణలో పలుచోట్ల ఈ ముహర్రం పండుగను పీర్ల పండుగ అనే పేరుతో జరుపు కుంటారు. వారం రోజుల పాటు హిందూ, ముస్లిం సోదరులు కలిసి కట్టుగా పీర్లను పిల్లను నెలకొల్పి, చివరి రోజు వేలాదిమంది తోడురాగా వెళ్ళి పరి సమాప్తి గావిస్తారు. పీర్ల పండుగ సందర్భంగా సంతాన హీనులైన హిందూ స్త్రీలు మొక్కులు చెల్లించు కోవడం, పులుల ఇతర వేషాలతో విన్యాసాలు చేస్తూ, ఆడుతూ వారం డబ్బులు ప్రోగుచేసు కోవడం క్షేత్రం ఏటా అనుసరింప బడుతున్న సాంప్రదాయంగా మారింది. హైదరాబాద్ పాతబస్తీలో షియా ముస్లింలు తమను తాము హింసించు కుంటూ విషాదం వ్యక్తం చేస్తూ వూరేగింపులో పాల్గొంటారు. బీబీకా అలావా నుంచి ప్రారంభమై ఈ వూరేగింపు అలీజా కోట్ల, చార్మినార్, గుల్జార్ హౌస్, మీరాలం మండీ, దారుల్ షిఫాల మీదుగా కొనసాగి చాదర్ ఘాట్ వద్ద ముగుస్తుంది. శిక్షణ ఇచ్చిన ఏనుగుపై ఈ ఊరేగింపు సాగుతుంది.

**– రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494**

### ప్రగతికి సోపానాలు...

## తెలంగాణ రైల్వే మార్గాలు



నేటి ఆధునిక ప్రపంచంలో రవాణా వ్యవస్థ ఎంతో ప్రాముఖ్యతను వహిస్తుంది. రహదారులను జీవన రేఖలుగా పేర్కొంటారు. దేశంలోని ప్రజల ఆర్థిక సాంఘిక రాజకీయ జీవన పరిస్థితులు మెరుగుపడాలంటే ఆ దేశ రవాణా వ్యవస్థ పటిష్టంగా ఉండాలి. అన్ని రకాల రవాణా వ్యవస్థలు రోడ్డు రవాణా 80 శాతం వస్తువులు ప్రయాణికులను చేర వేస్తూ ప్రముఖ పాత్ర పోషిస్తుంది. దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందడానికి దేశంలోని వివిధ రంగాలను సమన్వయం చేసి దేశ అభివృద్ధికి రవాణా వ్యవస్థ ఎంతగానో తోడ్పడుతుంది.

రవాణాకు కీలక దిక్సూచి తెలంగాణ రైల్వేలు: రవాణా సౌకర్యాలు అన్నింటిలోనూ రైలు మార్గాల ద్వారా జరిగే రవాణాకు చాలా ప్రాముఖ్యత ఉంది. తెలంగాణ రాష్ట్రంలోని రైల్వేలు చాలా వరకు అన్ని ప్రధాన నగరాలలో అనుసంధా నింపబడి ఉన్నాయి. ఇది రాష్ట్రంలోనే కాకుండా పక్క రాష్ట్రాలలోని రైల్వే మార్గాలను కలిగింది. దేశంలో జరుగుతున్న రవాణాలో సగం భాగం రైల్వే ద్వారానే జరుగుతుంది. దేశ ఆర్థిక అభివృద్ధికి రైల్వేలు వెన్నెముక లాంటివి. మొట్టమొదటి రైలు మార్గం 1874లో నిజాం కాలంలో వేయబడింది. సికింద్రాబాద్ విజయవాడ మార్గం 1886లో పూర్తి అయింది. దక్షిణ మధ్య రైల్వే డివిజన్ల ద్వారా 700 ఒక స్టేషన్లో 6294 కిలోమీటర్ల బ్రాడ్ గేజ్ మార్గం 130 కిలోమీటర్ల మీటర్ గేజ్ మార్గం విస్తరించి ఉంది.

తెలంగాణ రైల్వే నెట్వర్క్: తెలంగాణ రాష్ట్రంలో 1822 కిలోమీటర్ల రైలు మార్గం ఉంది. 238 రైల్వే స్టేషన్లను ఏర్పాటు చేసి భారతీయ రైల్వే తన సేవలను అందిస్తుంది. తెలంగాణలో మొత్తం 10 రైల్వే జంక్షన్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ రైల్వే స్టేషన్లో హైదరాబాద్ 17వ ర్యాంకు సికింద్రాబాద్ 42వ ర్యాంకును వరంగల్ 51వ ర్యాంకును సాధించాయి. తెలంగాణలోని 149 రైల్వే స్టేషన్లో వైఫై కనెక్షన్ కలిగి ఉంది. తెలంగాణలో రైల్వే జోన్లు మరియు డివిజన్లో సౌత్ కొస్టల్ రైల్వే 10 స్టేషన్లో గుంటూరు ప్రధాన కార్యాలయంగా దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ ప్రధాన కార్యాలయాలుగా 101 రైల్వే స్టేషన్లో కలిగి ఉన్నాయి. 2017 బ్రాడ్ గేజ్ వ్యవస్థ 1753 కిలోమీటర్ల నుండి 2020 సంవత్సరం నాటికి 1870.567 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది.

దక్షిణ మధ్య రైల్వే: దక్షిణ మధ్య రైల్వే 1966వ సంవత్సరంలో 9 వ జోన్ గా ఏర్పడింది. దీని ఏర్పాటులో భాగంగా దక్షిణ రైల్వేలోని భాగమైన హుబ్లీ విజయవాడ డివిజన్ సెంట్రల్ రైల్వేలోని సోలాపూర్ సికింద్రాబాద్ డివిజన్లో విలీనం చేసి దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటు చేశారు. ఆ తర్వాత దక్షిణ రైల్వేలోని గుంతకల్లు డివిజన్ 1977లో దక్షిణ మధ్య రైల్వే జోన్ లో మరియు సోలాపూర్ డివిజన్ల సెంట్రల్ రైల్వేలో విలీనం చేశారు. సికింద్రాబాద్ డివిజన్లో రెండు భాగాలుగా విభజించి 1978లో సికింద్రాబాద్ 2003లో హైదరాబాద్ డివిజన్ ఏర్పాటు చేశారు. నాందేడ్ గుంటూర్ లను రెండు కొత్త డివిజన్ గా ఏర్పడ్డాయి. నూతనంగా ఏర్పడిన నైరుతి రైల్వేకు హుబ్లీ డివిజన్ గా మార్చడం జరిగింది. ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వేలో 6 డివిజన్లు ఉన్నాయి. సికింద్రాబాద్ విజయవాడ గుంటూరు గుంతకల్లు నాందేడ్లతో కలుపుకుని దేశంలోని ఆరు రాష్ట్రాలకు తన సేవలను అందిస్తుంది. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలకు విస్తృతమైన సేవలను అందిస్తుంది. మహారాష్ట్ర కర్ణాటక తమిళనాడు మధ్యప్రదేశ్ రాష్ట్రాలలోని కొంత భాగం తన సేవలను అందిస్తుంది. దీని పరిధి మొత్తం 71 రైల్వే స్టేషన్లను కలిగి ఉంది. ఈ విధంగా దక్షిణ మధ్య రైల్వేలో నడిచే రోజువారి రైళ్ల సగటు సంఖ్య ఎక్స్ప్రెస్ రైళ్లు 262 మరియు ఎంఎంటిఎస్ రైళ్లు 10 మొత్తం కలుపుకొని 272 రైళ్లను దక్షిణ మధ్య రైల్వే నడుపుతుంది. ఈ విధంగా తెలంగాణ రైల్వే మార్గాలు ప్రగతికి సోపానాలుగా నిలుస్తున్నాయి అనడంలో సందేహం లేదు.

**పందిరి: శ్రీనివాసులు. ఎంఏ (జాగ్రఫీ), బీఈడీ, ఎంసీజే (జర్నలిజం), పిజిడిసిజే (జర్నలిజం) ఉస్మానియా యూనివర్సిటీ.**



### మానవీయతకు మాయని మచ్చలుగా

## చిత్రహింసల ఘటనలు

(“ఐరాస అంతర్జాతీయ చిత్రహింస బాధితుల మద్దతు దినం” సందర్భంగా)




చిటికెడు రుణం కోసం వెట్టిచాకిరీ దురాచారాలు, బాల కార్మికుల శ్రమను దోచే సంపన్న కుసంస్కారులు, ఆలి నోట్‌లో గుడ్డలు కుక్కి చిత్రహింసలు చేస్తున్న మనసులేని భర్తలు, దినదినం అమానవీయ చిత్రహింసలకు గురవుతున్న అభాగ్యులు ఎందరో నిశ్శబ్దంగా రోధిస్తున్నారు, ఓదార్పుకి ఆమెడ దూరం అవుతున్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు, సంక్షోభాలు, తీవ్ర విపత్తుల నడుమ మిలియన్ల కొద్దీ ప్రజలు ఇప్పుడు కూడా చిత్రహింసలను అనుభవించడం కొనసాగుతున్న వేళ ప్రపంచ దేశాలు ప్రతి ఏట 26 జూన్‌న “ఐరాస అంతర్జాతీయ చిత్రహింస బాధితుల మద్దతు దినం (యూఎన్ ఇంటర్నేషనల్ డే ఇన్ సపోర్ట్ ఆఫ్ విక్టిమ్స్ టార్చర్)” పాటించడం ఆనవాయితీగా మారింది. సరైన కారణం లేకుండా అమానవీయంగా, ఉద్దేశ పూర్వకంగా హింసించడం లేదా బాధ పెట్టడాన్ని ‘టార్చర్’ లేదా ‘చిత్రహింస’గా నిర్వచిస్తారు.

ఐరాస అంతర్జాతీయ చిత్రహింస బాధితుల మద్దతు దినం–2026 ఇతివృత్తం:

చిత్రహింస పెట్టడం నేరమని, మానవ హక్కులను హరించడం అమానవీయమని, చిత్రహింసలు బాధితుల కనీస జీవించే హక్కులను కాలరాస్తున్నారని, వ్యక్తిత్వ హననం జరుగుతున్నదని తెలుసుకోవాలి. నేడు కనీసం వందకు పైగా సాయుధ పోరాటాలు జరుగుతున్నాయని, ఆయా ప్రాంతాల్లో అన్ని వయస్సుల ప్రజలు చిత్రహింసలకు గురవుతున్నారని అర్థం అవుతున్నది. ఐరాస ఏర్పాటు చేసిన ‘చిత్రహింస బాధితుల స్వచ్ఛంద నిధి’ ద్వారా ప్రతి ఏట కనీసం 50,000 మంది బాధితులకు న్యాయ, మానవీయ, మానసిక, వైద్య అవసరాలకు చేయూత ఇవ్వడం కొనసాగుతున్నది. స్వేచ్ఛకు దూరంగా నిర్బంధాల వలలో చిక్కుకున్న వారు, పిల్లలు–కౌమార యువత, శరణార్థులు, వలసదారులు, ఆదివాసీ జాతులు, లౌంగిక – లింగ ఆధార హింస బాధితులు లాంటి మిలియన్ల అభాగ్యులు నేడు ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా అల్పాదాయ దేశాల్లో చిత్రహింసలు కొనసాగుతున్నాయి. ఐరాస అంతర్జాతీయ చిత్రహింస బాధితుల మద్దతు దినం–2026 ఇతివృత్తంగా “చిత్రహింస : మానవత్వానికి వ్యతిరేకంగా నేరం (టార్చర్ : ఏ క్రైమ్ అగెనెస్ట్ హుమానిటీ)” అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది.

### అల్పాదాయ దేశాల్లో అధిక చిత్రహింసల నమోదు:

చిత్రహింస బాధితులు అధికంగా శ్రీలంక, ఇరాన్, ఇరాక్, అఫ్ఘనిస్థాన్, కాంగో, సూడాన్, ఇథియోపియా, టర్కీ, సిరియా లాంటి దేశాల్లో ఉన్నట్లు వివరాలు స్పష్టం చేస్తున్నాయి. ఇటువంటి అభాగ్య చిత్రహింస బాధితులకు మద్దతుగా ప్రజల్లో అవగాహన పెంచడం, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం, వారికి మానవ హక్కులు కల్పించడం, సామాజిక మాధ్యమాల వేదికగా బాధితుల పక్షాన గళాలు విప్పడం, బాధితుల పరిరక్షణ చట్టాలకు పదును పెట్టడం, బాధితుల జీవిత గాథలను వినిడం లాంటివి ఐరాస అంతర్జాతీయ చిత్రహింస బాధితుల మద్దతు దినం వేదికగా జరగాలి. చిత్రహింస బాధితులు దీర్ఘకాలిక మానసిక సమస్యలు, ఆందోళనలు, నిరాశలు, ఒత్తిడులు, నొప్పులు, తలనొప్పి, శ్వాస ఇబ్బందులు లాంటి వ్యాధి లక్షణాలు కనిపిస్తాయని గమనించాలి.

ప్రతి ఒక్కరు కనీస గౌరవాన్ని, మర్యాదను పొందడానికి అర్హులని తెలుసుకోవాలి. ఇలాంటి చిత్రహింస బాధితులకు మద్దతుగా నిలుస్తూ, అవసర చేయూతను అందిస్తూ, స్వేచ్ఛను బహుకరిస్తూ, మానవీయతను బతికిస్తూ వారి జీవితాల్లో సానుకూల మార్పులకు కారణం కావాలి. ఇలాంటి చిత్రహింసలు జరగకుండా చూసుకోవడం, బాధితులకు అండగా నిలవడం మన కనీస కర్తవ్యమని తెలుసుకుందాం, చిత్రహింసలు లేని పౌర సమాజాన్ని నిర్మించుకుందాం.

డాక్టర్ : బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## కోహెడలో గ్రామసభలో అభివృద్ధి దిశగా చర్చలు



**కోహెడ, (సింగిడి) :** సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం భాగంగా గ్రామసభను సోమవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి మండలంలోని ముఖ్య అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో, వ్యవసాయ శాఖ ఏఈఓ, డిఆర్డీఏ-ఐకెపి సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బందేల సుజాత మాట్లాడు తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం గ్రామాల అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. గ్రామంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధి, తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, వ్యవసాయ సంబంధిత సమస్యలు, పింఛన్లు, రేషన్ వంటి అంశాలపై ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారులకు తెలియజేయాలని కోరారు. అధికారులు మాట్లాడుతూ, ప్రజలు ఇచ్చే ఫిర్యాదులు, సూచనలను పరిగణనలోకి తీసుకుని తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామస్థులు తమ సమస్యలను వివరంగా అధికారుల ముందుంచి పరిష్కారం కోరగా, అధికారులు వాటిని నమోదు చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ప్రజల చురుకైన పాల్గొనడంతో గ్రామసభ విజయవంతంగా నిర్వహించబడింది.

## బొజ్జగూడెం తండలో 'గ్రామ సభ'



**కోదాడ, (సింగిడి)** అనంతగిరి మండలం బొజ్జగూడెం తండ గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ సభను సర్పంచ్ గుగులోతు నీలాబాయి శ్రీనివాస్ అధ్య క్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి, ఉచిత బస్సు, రూ.500 గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి, కళ్యాణ లక్ష్మి, చేయూత పింఛన్, కొత్త రేషన్ కార్డులు వంటి పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రజిని, ఉపసర్పంచ్ నాగమణి రవి కార్యదర్శి ఉపేందర్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ధైర్య సాహసాలకు ప్రతీక సర్దార్ సర్వాయి



**గద్వాల ప్రతినిధి (సింగిడి) :** ఆత్మ గౌరవానికి, ధైర్య సాహసాలకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రతీకగా నిలుస్తారని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316వ వర్ధంతిని పురస్కరించుకొని ఐడిఓసి వద్ద జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి అదనపు కలెక్టర్ తో పాటు ఇతర అధికారులు, గౌడ సంఘం నేతలు పూలమాలలు వేసి, పూజలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గోల్కొండ కుతుబ్షాహీ పాలకుల ఏలుబడిలో ప్రజలకు రకరకాల పన్నులు విధించ డంతో ఇబ్బంది పడేవారని, వీరి ఇతర ఆగడాలను ఎదిరించడానికి పాపన్న గౌడ్ విప్లవకారుడిగా మారారన్నారు. యుద్ధ విద్యలు నేర్చుకొని ప్రత్యేకంగా సైన్యాన్ని సమకూర్చుకొని పలు కోటలను తన వశం చేసుకున్నారన్నారు. సామాన్య వ్యక్తిగా జీవితాన్ని ఆరంభించి రాజ్యాలను స్థాపించి పరిపాలన సాగించడం మనకెంతో గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రాములు, గౌడ సంఘం నేతలు అచ్చన్న గౌడ్, రామన్ గౌడ్, హరిప్రసాద్ గౌడ్, నందకిషోర్ గౌడ్, రాజశేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ



**పెబ్బేరు, (సింగిడి) :** వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ వివిధ వార్డులకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను గురువారం ఆయన కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలను ఆదుకోవడంలో సీఎం సహాయనిధి కీలక పాత్ర పోషిస్తోందన్నారు.



### ప్రజల భాగస్వామ్యంతో

## గ్రామ అభివృద్ధి సాధ్యం

**సర్పంచ్ ఊరడి భారతి జైపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ మాట్ల హరికుమార్**

**భీమదేవరపల్లి (సింగిడి) :** భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామంలో గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ ఊరడి భారతి జైపాల్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మాట్ల హరికుమార్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రజల సహకారం అత్యంత కీలకమని తెలిపారు. గ్రామసభ స్పెషల్ ఆఫీసర్ స్వరూప రాణి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలు తీరు, గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రగతి నివేదికలను వివరించారు. ప్రజలకు అందుతున్న సేవలపై కూడా ఆమె అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి శరత్ గ్రామ అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర వివరాలు అందించారు. వివిధ రంగాలలో చేపట్టిన పనులు, భవిష్యత్ కార్యాచరణపై వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ స్థాయి అధికారులు, సిబ్బంది, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామ అభివృద్ధి పై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

# జిల్లాకో మండలంలో సమీకృత భూభారతి

**ప్రతి జిల్లాలోని 70 గ్రామాల్లో పూర్తిస్థాయి సర్వే**

**ప్రతి సర్వే నెంబర్‌కు భూధార్**

**వీలైనంత త్వరగా సాదాబైనామాలకు పరిష్కారం**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



**రంగారెడ్డి బ్యూరో, (సింగిడి) :** రాష్ట్రంలో ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను 45 రోజుల పాటు పరిశీలించి తర్వాత అవసరమైన మార్పులు, చేర్పులతో జిల్లాకొక మండలంలో ప్రవేశపెడతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలంలోని విఠాయిపల్లి గ్రామంలో జరిగిన వార్డు సభలో ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో రెవెన్యూ శాఖలో విప్లవాత్మక సంస్కరణలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఈరోజున ఆమనగల్ మండలంతోపాటు ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణపేట జిల్లా కొస్గి మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు మంత్రి గారు తెలిపారు. ఏ పేదోడు ఏ ఆఫీసు చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు ఏ అధికారి దగ్గరికి వెళ్ళి ప్రాధేయపడవలసిన అవసరం లేదు తన చేతిలో ఉన్న స్మార్ట్ ఫోన్ తో ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ లో లాగిన్ అయితే అన్ని సేవలు లభిస్తాయని అన్నారు.
గత ప్రభుత్వ పాలకులు ప్రవేశపెట్టిన ధరణి కారణంగా రాష్ట్రంలో 9.52 లక్షల సాదాబైనామా దరఖాస్తులకు దిక్కులేకుండా పోయిందని ఇప్పుడు ఈ పేదల ప్రభుత్వం దీనిపై దృష్టి సారించిందని తెలిపారు. సాగుచేస్తూ, వారి అధీనంలో ఉండే భూములకు సంబంధించి సదరు వ్యక్తి వద్ద కన్సెంట్ తీసుకొని వారికే భూమి పట్టాను ఖరారు చేస్తామని దీనికోసం వారం రోజుల క్రితం భూభారతిలో సవరణ చేస్తూ జీవో జారీ చేశామని వెల్లడించారు. అంతేగాక గతంలో గ్రామంగా ఉండి ఇప్పుడు మున్సిపాలిటీగా మారిన ప్రాంతాలకు ఈ సాదాబైనామాలు వర్తించేలా చేస్తామని మంత్రి పొంగులేటి గారు ప్రకటించారు. ప్రజల కోసం తమ రెవెన్యూ శాఖలో గణనీయమైన మార్పులు తెస్తున్నామని దీనిలో భాగంగా అక్రమాల ధరణిని చెప్పినట్లే బంగాళాఖాతంలో కలిపి భూభారతి తెచ్చామని, ఆధార్ నెంబర్‌లా ప్రతి భూమికి భూధార్ నెంబర్‌ను కేటాయిస్తా మని చెప్పారు. అంతేగాక రాష్ట్రంలో 10.984 రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి జీపీవోలను నియమించడం జరిగింది.
5300 మందికి రెండు విడతల్లో ఆరునెలల పాటు శిక్షణ ఇచ్చి మండలానికి 4 నుంచి 6 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించామని తెలి పారు. సర్వే విషయంలో కూడా పాత పద్ధతు లకు స్వస్తి పలికి ఇప్పటికే 411 రోవర్లతో కచ్చితమైన సర్వే చేయిస్తున్నామని, త్వరలో మరో 400 రోవర్లు రాబోతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఈ నియోజకవర్గ పరిధిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయ భవనాలకు త్వరలో తాను శంకుస్థాపన చేస్తానని మంత్రి పొంగులేటి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి లోకేష్‌కుమార్, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# రసాభాసాగా సాగిన గ్రామసభలు







**- రంగంపేట గ్రామసభలో గందరగోళం**

**- పోతాంశెట్టిపల్లి గ్రామ సభలో సర్పంచ్, వార్డ్ మెంబర్ల మధ్య రభస**

**కొల్చారం, (సింగిడి) :** కొల్చారం మండల వ్యాప్తంగా గురువారం నాడు గ్రామసభలు కొన్నిచోట్ల వాగ్వివాదాల మధ్య జరిగాయి. మండలంలోని 22 గ్రామాలను గ్రామ సర్పంచులు గ్రామసభలు నిర్వహించడం జరిగింది. ఈ గ్రామసభలో సంవత్సరకాలంలో చేసిన పనులు అన్ని శాఖల వారు ప్రజలకు తెలియజేశారు. రంగంపేట గ్రామంలో ప్రజలకు జరిగిన ఇబ్బందులను గ్రామ సభలో తెలియజేశారు. పోతంశెట్టిపల్లి గ్రామపంచాయతీలోని గ్రామసభలో సర్పంచ్ కు మరియు వార్డు మెంబర్లకు మధ్య వాగ్వాదం జరిగింది. సర్పంచ్ తాను చేస్తున్నటువంటి పనులు వార్డ్ మెంబర్లకు అనుమతి లేకుండా, తనకు ఇష్టం వచ్చినట్లు చేస్తున్నారని తెలియజేశారు. గ్రామంలో వేసిన సీసీ రోడ్లకు పూర్తిస్థాయిలో క్యూరింగ్ చేయడం లేదని నీళ్లు పట్టడం లేదని గ్రామ సర్పంచును ప్రశ్నించారు. గ్రామ సెక్రెటరీ వసూలు చేసిన పన్ను వివరాలు, అడగగా కామ సెక్రెటరీ వివరాలు చెప్పడంలో పూర్తిగా విఫలమ య్యారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు.

# పెబ్బేరు మున్సిపాలిటీలో వార్డు సభ విజయవంతం



**పెబ్బేరు (సింగిడి) :** వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని 4, 5, 6, 7 వార్డులకు కలిపి 5వ వార్డు చెలిమిల్ల గ్రామ పంచాయతీ భావనంలో మున్సిపల్ వార్డు సభ నిర్వహించారు. సభ ప్రారంభంలో తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించడంతో పాటు ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. వార్డులో అమలు చేసిన వివిధ ప్రభుత్వ పథకాలు, వాటి ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలను అధికారులు సభలో చదివి వినిపించారు. ఇందులో రైతు రుణమాఫీ, రైతు భరోసా, వరి ధాన్యం సేకరణ చెల్లింపులు, రేషన్ కార్డుల మంజూరు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు లబ్ధిదారులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, చేయూత పెన్షన్లు, ఉచిత చీరల పంపిణీ వంటి అంశాలను వివరించారు. అలాగే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద కల్పించిన పనిదినాలు, చెల్లించిన వేతనాలు, చేపట్టిన పనులు, వాటి అంచనా విలువలను లబ్ధిదారుల పేర్లతో సహా వెల్లడించారు. ప్రజల సమస్యలు, అవసరాలు, అలాగే ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగమైన 99 రోజుల కార్యాచరణపై చర్చించారు. వార్డు సభలను తరచూ నిర్వహించాలని, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు, కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో చురుకుగా పాల్గొని వార్డుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం త్వరలో ప్రతి పేద కుటుంబానికి రూ.5 లక్షల ఇందిరమ్మ జీవిత భీమా అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం పథకాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగి జావా అందించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల వరకు పరిమితమైన మధ్యాహ్న భోజన పథకాన్ని ఇకపై జూనియర్ కళాశాల విద్యార్థులకు కూడా విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ వర్ధన్, 4వ వార్డు కౌన్సిలర్ దాసరి జాములమ్మ, 5వ వార్డు కౌన్సిలర్ భాగ్యలక్ష్మి, 6వ వార్డు కౌన్సిలర్ తాటికొండ కృష్ణ, 7వ వార్డు కౌన్సిలర్ శివసాయి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభకు ప్రజలు హాజరు కానీ వేళ..! మూగబోయిన గ్రామ సభలు

**అమలు కానీ హామీలతో కాంగ్రెస్ విఫలం**

**అధికారులు హాజరు కానీ గ్రామసభల నిర్వాహణ ఎందుకు...?**

**ప్రశ్నించిన బీఆర్ఎస్ జిల్లా నాయకులు సోయం వీరభద్రం..**





**దమ్మపేట, (సింగిడి) :** మండల పరిధిలోని కొమ్ముగూడెం గ్రామంలో కొత్త పంచాయతీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల ప్రణాళికలో భాగంగా స్థానిక సర్పంచ్ సోయం సత్యవతి అధ్యక్షత గురువారం గ్రామసభ నిర్వాహించారు. ఈ గ్రామ సభలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు సోయం వీరభద్రం మట్లాడుతూ ప్రజాపాలన అంటు ప్రగల్భాలు పలికి అమలు కానీ 6 హామీలతో గద్దెనెక్కినా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో లో ఇచ్చిన వాగ్దానాలు కళ్యాణలక్ష్మి, తులం బంగారం, రైతుభరోసా, సంవత్సరానికి 6 గ్యాస్ సిలిండర్లు, గృహలక్ష్మి మహాలక్ష్మి, వృద్ధాప్య, వికలాంగుల, పింఛన్ల పెంపు, 10లక్షలు రూపాయలు రాజీవ్ ఆరోగ్యశ్రీ ఇలా చెప్పుకుంటే పోతే 420వాగ్దానాలు ఉన్నయని ఎద్దేవా చెసారు. అధికారులు పూర్తి స్థాయిలో హాజరు కానీ గ్రామ సభలు వల్ల ఉపయోగం లెదని, ప్రజల ప్రశ్నలు కి అధికారులు జవాబుదారీ తనం లెని ఎన్ని గ్రామ సభలు పెట్టినా ఎమి ప్రయోజనం ఉండదని ఘాటు విమర్శలు చేశారు. గ్రామ సభకు హాజరు అయ్యిన నోడల్ అధికారి వెంటనే ప్రభుత్వానికి గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యలు పైన సమగ్రమైన నివేదికలు అందించాలని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం అన్ని గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధి సహకారము అందించిందని సిసి రోడ్లు, వీధి దీపాలు, డ్రనేజీ, క్రీడాస్థలాలు, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, పచ్చధనం పరిశు భ్రత కోసం గ్రామ పంచాయతీకి ట్రాక్టర్ నీటి ట్యాంక్ మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గం సభ్యులు, కార్యదర్శి, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 99 రోజుల అభివృద్ధి ప్రణాళికపై చర్చ



**భీమదేవరపల్లి, (సింగిడి) :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని రాంనగర్ గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమం భాగంగా గ్రామసభను ఘనంగా నిర్వహించారు. ఈ గ్రామసభలో ప్రభుత్వం ప్రకటించిన 99 రోజుల అభివృద్ధి ప్రణాళికపై విస్తృతంగా చర్చించారు. గ్రామ సర్పంచ్ డప్పు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి మండల అధికారులు, సీనియర్ అసిస్టెంట్ షాబోద్దీన్ గ్రామ ప్రజలు, మహిళా సంఘాల ప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పంచాయతీ కార్యదర్శి తుమ్మ సందీప్ గ్రామ అభివృద్ధికి సంబంధించి తక్షణ అవసరాలపై ప్రజలు తమ అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్యుత్, ఆరోగ్య సేవలు వంటి అంశాలపై గ్రామస్థులు సమస్యలను వివరించారు. అధికారులు మాట్లాడుతూ 99 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామంలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడిం చారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు అభివృద్ధి పనులకు ప్రాధాన్యత కేటాయిస్తూ నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, అంతర్గత రహదారుల నిర్మాణం, పాఠశాలల అభివృద్ధి, వంటి అంశాలు చర్చకు వచ్చాయి. గ్రామసభలో ప్రజలు కూడా ప్రభుత్వంపై నమ్మకం వ్యక్తం చేస్తూ, అభివృద్ధి కార్యక్రమాలు పారదర్శకంగా అమలు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారంలో అధికారులు చురుకుగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భూక్య తిరుపతి వార్డు సభ్యులు నూనె తిరుమల రవీందర్, ఎలుకపల్లి స్వరూప, పార్నంది ఆంజనేయులు, మిట్టపల్లి అపర్ణ రాకేష్, సయ్యద్ గోరె, భూక్య రవి, కళ్యాణి గ్రామపెద్దలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం కీలకమని, అందరూ కలిసి పనిచేస్తేనే 99 రోజుల ప్రణాళిక విజయవంతమవుతుందని అధికారులు పేర్కొన్నారు.

## పెబ్బేరులో హనుమాన్ జయంతి శోభాయాత్ర





**పెబ్బేరు(సింగిడి) :** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణ కేంద్రంలో హనుమాన్ జయంతి సందర్భంగా హిందూజాగృతం, హిందూ వాహిని సంస్థల ఆధ్వర్యంలో శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, యువకులు, మహిళలు పాల్గొని భక్తి శ్రద్ధలతో ఊరేగింపును విజయవంతం చేశారు. శోభాయాత్ర పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. శ్రీ ఆంజనేయ స్వామివిగ్రహాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి, భజనలు, కీర్తనలు మధ్యభక్తులు జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో ఊరేగింపును ఉత్సాహంగాకొనసాగించారు. శాంతి భద్రతల కోసం పోలీసులు తగిన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం ఎటువంటి అంతరాయం లేకుండా ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగానిర్వాహకులు మాట్లాడుతూ, హనుమాన్ జయంతి ఉత్సవాలు భక్తులకు ఆధ్యాత్మికఉత్సాహాన్ని నింపుతాయని, ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు.

## ప్రజాపాలన గ్రామసభల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జారె



**దమ్మపేట,(సింగిడి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రామ సభలు గురువారం నుండి ప్రారంభమవుతున్న నేపథ్యంలో దమ్మపేట మండలంలోని పలు గ్రామపంచాయతీలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడం గ్రామ సభల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇటీవల ఎన్నికైన గ్రామపం చాయతీ పాలకవర్గ సభ్యులు గ్రామాల్లో ప్రజల సమస్యలను గుర్తించి ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో పారదర్శకంగా బాధ్యతగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు.

## పొంగులేటిపై అసత్య ప్రచారాలు మానుకోవాలి

**- యారగొర్ల రాధాకృష్ణ ధ్వజం**



**దమ్మపేట, (సింగిడి) :** రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అసంబద్ధమని, రాజకీయ లబ్ధి కోసమే ఇటువంటి అసత్య ప్రచారాలకు తెరలేపారని అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు రాధాకృష్ణ యర్రగొర్ల మండిపడ్డారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ ఉనికి కోల్పోవడానికి పొంగులేటి నే ప్రధాన కారకులని భావించి ఓర్వలేకనే కేటీఆర్, హరీశ్ రావు వంటి నేతలు బురద జల్లుతున్నారని ధ్వజమెత్తారు. గత పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఇసుక, గ్రానైట్ దందాల గురించి ప్రజలందరికీ తెలుసని, తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికే ఇప్పుడు నీతి సూక్తులు చెబుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే గత పదేళ్లలో జరిగిన అన్ని మైనింగ్ అక్రమాలపై సిబిసిఐడి విచారణకు ఆదేశించారని, త్వరలోనే అసలు దోపిడీ దారులు ఎవరో నిగ్గు తేలుతుందని ఆయన స్పష్టం చేశారు. రాఘవ కన్స్ట్రక్షన్స్ లేదా వట్టినాగులపల్లి భూముల విషయంలో మంత్రికి కానీ, ఆయన కుమారుడు హర్షకు కానీ ఎలాంటి సంబంధం లేదని, కేవలం రాజకీయంగా ఎదుర్కోలేక కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకోవడం బీఆర్ఎస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని కాంగ్రెస్ నాయకులు రాధాకృష్ణ యర్రగొర్ల ఆక్షేపించారు. ఇప్పటికైనా ఇలాంటి పసలేని ఆరోపణలు మానుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## వెంకట్రామపురంలో గ్రామసభ నిర్వహణ



**కోదాడ,(సింగిడి) :** అనంతగిరి మండలం వెంకట్రామపురం గ్రామంలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొల్లికొండ జయరాజు గ్రామాభివృద్ధికి సంబంధించిన అంశాలను వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అవసరమని ఆయన పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను సమర్పించారు. కార్యక్రమంలో అధికారులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## వాయిలసింగారంలో గ్రామసభ నిర్వహణ



**కోదాడ (సింగిడి) :** అనంతగిరి మండలం వాయిలసింగారం గ్రామంలో సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు . రాష్ట్ర గీతంతో ప్రారంభమైన ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని నోడల్ అధికారి నిరంజన్ చదివారు. సర్పంచ్ ప్రభుత్వ పథకాలపై గ్రామ ప్రజలకు వివరించారు. కార్యక్రమం లో గ్రామపంచాయితీ కార్యదర్శి సౌమ్య, వార్డు సభ్యులు భవానీ, సింధూర, నాగరాజు, గ్రామశాఖ అధ్యక్షుడు కంటు వేణు, గ్రామ పెద్దలు కొల్లు సుబ్బారావు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



## శ్రీ వీరభద్ర స్వామిని దర్శించుకున్న దేవాదాయ శాఖ అధికారులు

**భీమదేవరపల్లి,(సింగిడి) :** నేడు దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ జోన్ ఉప కమిషనర్ మరియు వరంగల్ జిల్లా సహాయ కమిషనర్ రామాల సునీత శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆమెకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి శేష వస్త్రం అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమెకు ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ముఖ్య అర్చకులు రాంబాబు, శ్రీకాంత్‌తో పాటు అర్చ కులు వినయ్, సందీప్, శివకుమార్, వీరభద్రయ్య, శశాంక్ పాల్గొన్నారు. అదేవిధంగా ఆలయ సిబ్బంది రవీందర్, నారా యణరావు, శ్రీధర్, అనూష తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు ఆలయ నిర్వహణ, భక్తులకు అందుతున్న సదుపాయాలపై సమీక్ష నిర్వహించి, మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

Singer Sunitha



## నా బాడీ నాష్టం అంటే..
# వాడి కళ్లు వాడి ఇష్టం
### స్త్రీల వేషధారణపై పరిమితులుండాలన్న సునీత

ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ సునీత ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మహిళల వస్త్రధారణ, సినిమా సామాజిక బాధ్యత, సమాజంలో స్వేచ్ఛ అనే అంశాలపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చకు దారితీశాయి. సమాజంలో జరిగే విషయాలనే సినిమాలో చూపిస్తున్నామని మేకర్స్ చెప్పే సమాధానాన్ని సునీత తప్పుబట్టారు. కమర్షియల్ సినిమా అయినా, ఎలాంటి సినిమా అయినా సమాజం పట్ల కొంత బాధ్యత కలిగి ఉండాలని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే సమాజంలో సినిమాని తిడితే, సినిమాలో సమాజాన్ని తిడుతున్నారు, సమాజం అలా ఉంది కాబట్టే తాము ఇలా సినిమా తీశామని మేకర్స్ చెబుతున్నారని సునీత పేర్కొన్నారు.

ఇక ఇటీవల కాలంలో బాగా వినిపిస్తున్న మై బాడీ మై రైట్ అనే స్లోగన్‌పై సునీత ప్రాక్టికల్ కోణంలో మాట్లాడారు. అమ్మాయిలు నా బాడీ నాఇష్టం అని తమకు నచ్చిన బట్టలు వేసుకున్నప్పుడు, అవతలి వ్యక్తి చూసే చూపును కూడా వాడి కళ్ళు వాడి ఇష్టం అనాల్సి వస్తుందని, ఇందులో ఎవరినీ తప్పు పట్టలేమని అన్నారు. ఎవరి ఇష్టం వారిదని ఆమె స్పష్టం చేశారు. అయితే బట్టల పరిధిని పెంచుకోవడాన్ని లేదా తగ్గించుకోవడాన్ని తన దృష్టిలో అసలైన స్వేచ్ఛ అనరని సునీత తెలిపారు. చుట్టూ ఉన్న పరిసరాలు ఎంత వరకు సురక్షితంగా ఉన్నాయో చూసుకోవడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. కేవలం బట్టలు లేదా సిగరెట్లు తాగడం ఈక్వాలిటీ కాదని, సమాజంలో లేదా ఒక ఇంట్లో ఒక మహిళ తన అభిప్రాయాన్ని చెప్తే, దానికి పురుషులు ఎంతవరకు విలువ ఇస్తున్నారు అనే దానిపై పోరాడాలని సునీత అభిప్రాయపడ్డారు. పెద్ది సినిమాలో జాన్వీ కపూర్ పాత్ర చిత్రీకరణపై కూడా సునీత పరోక్షంగా ప్రస్తావిస్తూ ఎవరి ఒపీనియన్ వాళ్లది. ఎస్ చెప్పాలన్నా, నో చెప్పాలన్నా మన ఇష్టమే. కేవలం సినిమా ఇండస్ట్రీలోనే కాదు, నేను జనరల్ గా సొసైటీలో ఉన్న అమ్మాయిల గురించి కూడా మాట్లాడుతున్నాను. ఇక్కడ ఒక గీత గీయాలంటే, ఫుల్ స్టాప్ పెట్టాలంటే బలవంతం ఏమీ లేదు అని సునీత తెలిపారు.

# 'ఇడుపు కాయితం'..
### 15 రూల్స్ పెట్టింది: బన్నివాసు



భిన్నమైన కథలను ఎంచుకుంటూ అలరిస్తుంటారు నటుడు ప్రియదర్శి ఆయన ప్రధాన పాత్రలో జానపద గాయని నాగ దుర్గ హీరోయిన్‌గా రానున్న చిత్రం 'ఇడుపు కాయితం' 'ఇడుపు కాయితం' అంటే తెలంగాణ వాడుక భాషలో 'విడాకుల పత్రం' అని అర్థం. నేడు ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌ను స్టార్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ విడుదల చేశారు. వంశీ రెడ్డి దొండపాటి దర్శకత్వంలో రానున్న ఈ సినిమాను సుకుమార్ సమర్పణలో బన్నివాసు నిర్మిస్తున్నారు.

90 టేక్స్.. 20 నిమిషాలు లంచ్ బ్రేక్: 'వారణాసి'పై పృథ్వీరాజ్ సుకుమారన్ ఈ సందర్భంగా బన్నివాసు మాట్లాడుతూ.. కథ బాగుంటే దానికి సరిహద్దులు ఉండవని ఎన్నోసార్లు రుజువైందని అన్నారు. "ఇది గ్లోబల్ స్థాయి కథ. ఈ తెలుగు సినిమాను బిహార్‌లో రిలీజ్ చేసినా అక్కడ కూడా ఆదరణ సొంతం చేసుకుంటుంది. ప్రతి ఇంట్లోనూ ఒక కామన్ ప్రాబ్లమ్ ఉంటుంది. పెళ్లి అయిన ప్రతి ఒక్కరికీ ఆ సమస్య తెలుసు. ఈ చిత్రానికి అందరూ కనెక్ట్ అవుతారు. ఏ కోడలైనా తన అత్తమామలను ఈ మూవీకి తీసుకుని వెళ్తే.. బయటకు వచ్చేటప్పుడు అత్తగారు కచ్చితంగా కోడలి చేతులు పట్టుకుని వస్తారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా చేయాలని నాగదుర్గను సంప్రదించగానే ఆమె నాకు 15 రూల్స్ పెట్టింది. అవి విని నేను చాలా ఆనందించా. ఒక తెలుగు అమ్మాయి ఏ విషయంలోనైనా ఎంత క్లారిటీగా ఉంటుందనేది అర్థమైంది" అని బన్నివాసు తెలిపారు. సుకుమార్ రైటింగ్స్‌లో వచ్చే సినిమాలు ఎలా ఉంటాయో అందరికీ తెలుసని, ఈ చిత్రం కూడా ఒక మైలురాయిగా నిలుస్తుందని సుకుమార్ భార్య తబిత చెప్పారు.

# మామ సినిమాకు అల్లుడు క్లాప్
### బాలకృష్ణ 112వ చిత్రానికి లోకేశ్ కెమెరా ఆన్



రాజధాని అమరావతిలో నందమూరి నటసింహం బాలకృష్ణ 112వ చిత్రం గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది. సినిమా ప్రారంభోత్సవ వేడుకలకు మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేష్ ముఖ్య అతిథులుగా హాజరై.. క్లాప్ కొట్టి, కెమెరా స్విచ్ఆన్ చేశారు. ఈ సందర్భంగా హీరో బాలకృష్ణ మాట్లాడుతూ.. సినిమా ఓపెనింగ్ కోసం వచ్చిన మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సినిమా మొదటి షాట్‌ను డైరెక్ట్ చేసిన నందమూరి తేజస్వినికి ధన్యవాదాలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద సినిమాకి క్లాప్ కొట్టి 20 సంవత్సరాలు అయ్యిందన్నారు. ఏపీలో సినీ పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని అన్నారు. పర్యాటక రంగం, సినీ పరిశ్రమ రెండూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని బాలయ్య తెలిపారు. సినీ ఇండస్ట్రీని ప్రోత్సహించే ప్రయత్నం చేస్తున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు.

## వెండితెరపైకి వస్తోన్న
# మిర్జాపూర్

అత్యంత ప్రజాదరణ పొందిన క్రైమ్ డ్రామా వెబ్ సిరీస్ 'మిర్జాపూర్' ఇప్పుడు వెండితెరపై అలరించడానికి సిద్ధమైంది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో మూడు సీజన్ల పాటు ఓటీటీ ప్రేక్షకులను అలరించిన ఈ సిరీస్, ఇప్పుడు 'మిర్జాపూర్: ది మూవీ' పేరుతో భారీ ఫీచర్ ఫిల్మ్‌గా రాబోతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సినిమాకు సంబంధించిన అధికారిక టీజర్‌ను విడుదల చేశారు. ఈ టీజర్‌లో పంకజ్ త్రిపాఠి కాలీన్ భయ్యాగా, అలీ ఫజల్ గుడ్డూ భయ్యాగా, దివ్యేందు మున్నా భయ్యాగా తమ ఐకానిక్ పాత్రల్లో మళ్లీ కనిపించి అభిమానులను అలరించారు. మరోవైపు ఈ చిత్రంలో రవి కిషన్, పంచాయత్ ఫేమ్ జితేంద్ర కుమార్ కీలక పాత్రల్లో ఎంట్రీ ఇస్తూ మరింత ఆసక్తిని పెంచుతున్నారు. రెండు నిమిషాల కంటే ఎక్కువ నిడివి ఉన్న ఈ టీజర్ పాత జ్ఞాపకాలను గుర్తు చేస్తూ, మరింత భారీ యాక్షన్ మరియు పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో సాగింది. ఈ సారి కేవలం మిర్జాపూర్ గద్దె కోసమే కాకుండా అధికారం కోసం కూడా యుద్ధం జరగబోతోందని టీజర్‌తో స్పష్టమవుతుంది. ఈ చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. కేవలం హిందీలోనే కాకుండా ఇతర భాషలో కూడా థియేటర్లలో విడుదలరాబోతున్నట్లు తెలుస్తుంది.




## సందీప్ కిషన్
# సూపర్ సుబ్బు



టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ ప్రధాన పాత్రలో నటించిన సరికొత్త వెబ్ సిరీస్ 'సూపర్ సుబ్బు'. నెట్‌ఫ్లిక్స్ సంస్థ అందిస్తున్న మొట్టమొదటి ఒరిజినల్ తెలుగు సిరీస్ ఇదే కావడం విశేషం. తాజాగా ఈ సిరీస్ అఫీషియల్ ట్రైలర్‌ను నెట్‌ఫ్లిక్స్ ఇండియా విడుదల చేసింది. 'డీజే టిల్లు' ఫేమ్ డైరెక్టర్ మల్లిక్ రామ్ ఈ కామెడీ డ్రామా సిరీస్‌ను తెరకెక్కించారు. బాలీవుడ్ 'లిటిల్ థింగ్స్' ఫేమ్ మిథిలా పాల్కర్ ఈ సిరీస్‌లో హీరోయిన్‌గా నటిస్తోంది. ఒక అమాయక యువకుడు, అత్యంత సంప్రదాయ గ్రామం, అసాధ్యమైన ఓ ఉద్యోగం అనే ఆసక్తికరమైన క్యాప్షన్‌తో ఈ సిరీస్ వస్తోంది. సుబ్రమణ్యం చిలుకూరి రావు అలియాస్ సుబ్బు అనే ఒక అమాయక పల్లెటూరి యువకుడికి ఎవరూ వెళ్లడానికి ఇష్టపడని 'మాకీపూర్' అనే వింత ఊరికి పోస్టింగ్ వస్తుంది. తన తండ్రి కుకటేశ్వరరావు ముందు పరువు నిలబెట్టుకోవాలని ఆ ఊరిలో అడుగు పెట్టిన సుబ్బుకి అక్కడ ఊహించని షాక్ తగులుతుంది.



# ధర్మన్‌లో రజనీ డాక్టర్ అవతారం

అగ్రకథానాయకుడు సూపర్‌స్టార్ రజనీకాంత్ తన 173వ సినిమాతో మరోసారి అభిమానులను అలరించేందుకు సిద్ధమయ్యారు. 'ధర్మన్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో తలైవా 'ది డెడ్లీ డాక్టర్' అవతారంలో కనిపించనున్నారు. న్యాయాన్ని గెలిపించే ఓ వైద్యుడిగా రజనీకాంత్ పాత్ర చాలా వైవిధ్యంగా, పవర్‌ఫుల్‌గా ఉండబోతున్నట్టు తెలుస్తోంది. 'డ్రాగన్' ఫేమ్ అశ్వత్ మారిముత్తు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా, ఉలగనాయగన్ కమల్ హాసన్ తన రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. రజనీ, కమల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత సినిమా రావడం విశేషం. ఈ చిత్రంలో సిమ్రన్, రాశీ ఖన్నా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా చిత్రబృందం 'ది ఓజీ స్వాగ్' అనే క్యాప్షన్‌తో టైటిల్ పోస్టర్ మేకింగ్ వీడియోను విడుదల చేసింది. ఆ వీడియోలో రజనీకాంత్ స్టైల్, స్క్రీన్ ప్రెజెన్స్ మరోసారి అభిమానులను ఫిదా చేస్తున్నాయి. డాక్టర్ కోట్‌లో స్టెతస్కోప్‌తో, సీరియస్ లుక్‌లో తలైవా లుక్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. న్యాయం కోసం ఏ స్థాయికైనా వెళ్లే డాక్టర్‌గా రజనీకాంత్ ఈ సినిమాలో కనిపిస్తారని టాక్. అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారని సమాచారం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న 'ధర్మన్' త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుంది. రజనీ మార్క్ యాక్షన్, డైలాగ్స్, ఎమోషన్‌తో పాటు సామాజిక అంశాలను టచ్ చేసే కథతో ఈ సినిమా రూపొందుతోందని తెలుస్తోంది.



Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737